కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ : శనివారం, 25 మే 2024
సంపుటి: 14, సంచిక: 50, పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## ఆడబిడ్డల ఉసురు తగులుతది

### జగన్ నీకు సిగ్గుందా : వైఎస్ షర్మిల మండిపాటు





అమరావతి మే 24 (నిఘా న్యూస్): ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. ఇందుకు సంబంధించి ప్రచురిత మవుతున్న పలు ఇతర వార్తా కథనాల మేరకు ఏపీలో చోటు చేసుకున్న ఓ ఘటన విషయమై ఆమె మాట్లాడుతూ మిగతా2లో..

## త్వరలో మేడిగడ్డకు రేవంత్‌రెడ్డి



02

## నేడు ఆరో దశ ఎన్నికలు

### ఆరు రాష్ట్రాలు రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్

### 58 నియోజక వర్గాలకు జరగనున్న ఎన్నికలు



న్యూఢిల్లీ మే 24(నిఘా న్యూస్): దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికే 5 దశల పోలింగ్ జరిగింది. శనివారం 25 మే ఆరో దశ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరగనుంది. ఈ దశలో లోక్‌సభ ఎన్నికలు దేశ రాజధాని ఢిల్లీతో సహా మరో 6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తంగా 58 నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఉత్తరప్రదేశ్ 14, పశ్చిమ బెంగాల్ 8, ఢిల్లీ 7, ఒడిశా 6, బీహార్ 8 సీట్లు, హర్యానా 10 సీట్లు, జమ్మూ కశ్మీర్ 1, జార్ఖండ్ 4 సీట్లకుగానూ ఏకంగా 889 మంది అభ్యర్థుల బరిలో ఉన్నారు.గత నెలలో ఎన్నికల సంఘం జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానానికి పోలింగ్ తేదీని లాజిస్టికల్, కమ్యూనికేషన్ అండ్ కనెక్టివిటీకి సంబంధించి అడ్డంకుల కారణంగా మే 7 నుండి మే 25 కు మార్చింది. ఇక రేపు జరగనున్న ఎన్నికలకు ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇక దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలు చూస్తే ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని సుల్తాన్‌పూర్, ప్రతాప్‌గఢ్, ఫుల్పూర్, అలహాబాద్, అంబేద్కర్ నగర్, శ్రావస్తి, డోమ్రియాగంజ్, బస్తీ, సంత్ కబీర్ నగర్ మిగతా2లో..

# ఏడాదిలోగా... మోడీ రిటైర్మెంట్..!

### లక్ష సాధన కోసం దేవుడు నన్ను నియమించాడన్న మోడీ

### బిజెపిలో 75 ఏళ్లు నిండిన వారు రాజకీయాల నుంచి రిటైర్మెంట్ అవ్వాలి

### బీజేపీ నిబంధనల ప్రకారం మరో ఏడాది మాత్రమే మోదీకి పదవీ యోగం



మోడీ తర్వాత అమిత్ షా ప్రధాని కానున్నారా..!

దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ

మరో ఏడాదిలోగా మోడీకి వయస్సు అయిపోతుందని విపక్షాల ప్రచారం

దేవుడు నన్ను వెనక్కి పిలవడు

అమిత్ షాతో పాటు పలువురు ఆయన కుర్చీ కోసం పోటీ పడుతున్నట్లు చర్చలు

2047 నాటికి వికసిత్ భారత్

లక్ష్యాన్ని సాధిస్తాను

ఓ జాతీయ ఛానెల్ ఇంటర్వ్యూలో నరేంద్రమోదీ

న్యూఢిల్లీ మే 24(నిఘా న్యూస్): సార్వత్రిక ఎన్నికల వేళ బీజేపీలో కొత్త చర్చ మొదలైంది. మోదీ తర్వాత నెక్స్ట్ ప్రధాని ఎవరు ఒకవేళ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తేనే.. పార్టీ నిబంధనల ప్రకారం మరో ఏడాది మాత్రమే మోదీ ఆ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత ఎవరు అమిత్ షా లేక మరెవరైనా ఉన్నారా, ఇదే చర్చ జాతీయస్థాయిలో కొనసాగుతోంది. బీజేపీలో ప్రస్తుత నేతకు వయసు అయిపోయిందని , ఏడాది తర్వాత రిటైర్మెంట్ కావచ్చని ప్రత్యర్థి పార్టీలు కామెంట్స్ చేస్తున్నాయి. ఈ ప్రచారానికి తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు ప్రధాని నరేంద్ర మోదీ. ప్రత్యేక కార్య సాధన కోసం భవవంతుడు తనను పంపించాడని చెప్పుకొచ్చారు. లక్ష్యసాధన కోసం 2047 వరకు 24 గంటలు పని చేసేలా దేవుడు తనను నియమించాడని భావిస్తున్నట్లు మనసులోని మాట బయటపెట్టారు. ఈ యవ్వారంపై మిగతా2లో..

## 75 ఏళ్లకు... రిటైర్మెంట్ తప్పదన్న అమిత్ షా



### 2019 నాటి అమిత్ షా ప్రకటనను చూపించిన కేజ్రీవాల్

అమిత్‌షాకు లైన్ క్లీయర్ చేస్తున్న మోడీ

అందుకోసం యోగిని దూరం పెడుతున్నారని ఆరోపణలు

ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ మే 24(నిఘా న్యూస్): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అమిత్ షాను ప్రధానిని చేయడం కోసం, ఆ పార్టీలోని సీనియర్ నేతలు శివరాజ్ సింగ్, వసుందర రాజే, ఖతర్ సాహెబ్, డాక్టర్ రమణ్ సింగ్‌లను పక్కన పెట్టారని ఆరోపించారు. నేడో రేపో యూపీ ప్రస్తుత సీఎం యోగి ఆధిత్యనాథ్‌ను సైతం మిగతా2లో..

## రాష్ట్ర అవతరణ వేడుకలకు ఇసి అనుమతి

### ఘనంగా దశాబ్ది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు

### అధికారులతో సమీక్షించి సూచనలు చేసిన సిఎస్



హైదరాబాద్ మే 24(నిఘా న్యూస్): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. జూన్ 2న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే రోజు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించనున్నారు. ఈసీ నుంచి అనుమతి లభించిన నేపథ్యంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేయలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వివిధశాఖల అధికారులను ఆదేశించారు. దశాబ్ది వేడుకలు కావడంతో ధూమ్‌ధామ్‌గా చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో తెలంగాణ ఉద్యమకారులను సిఎం మిగతా2లో..



## ప్రజ్వల్‌ను దేశం దాటించిన దేవేగౌడ

### ప్రజ్వల్‌తో పాటు ఆయన తండ్రిపై లైంగిక వేధింపుల కేసు

### సిఎం సిద్దరామయ్య ఘాటు వ్యాఖ్యలు

బెంగళూరు మే 24 (నిఘా న్యూస్): మాజీ జేడీఎస్ నేత, ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ టేపుల కేసులో అధికార కాంగ్రెస్, జేడీఎస్ పార్టీని టార్గెట్ చేస్తోంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ప్రజ్వల్ రేవణ్ణ ఇండియా నుంచి జర్మనీకి పారిపోయేందుకు ఆయన తాత, మాజీ ప్రధాని దేవెగౌడ సహకరించారని సీఎం సిద్ధరామయ్య ఆరోపించారు. దేవెగౌడ స్వయంగా ప్రజ్వల్‌ని పంపారని నేను అనుకుంటున్నాను. ప్రస్తుతం ఆయన రాసిన లేఖ ప్రజలు చూసేందుకు మాత్రమే అని ఆయన మిగతా2లో..

## తీన్మార్ మల్లన్న చేసేవన్నీ లంగ పనులే

### ఆయనపై దాదాపు పది కేసులు అమ్మాయిలు పెట్టినవే ఉన్నవి

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌ను గెలిపించండి

02

### నకిరేకల్ ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్




## అమెరికా ఆస్తులను జప్తు చేయనున్న రష్యా

### రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక ఉత్తర్వులు జారీ

రష్యా ఆస్తులను జప్తు చేసిన అమెరికా మిత్ర దేశాలు

ఆ మొత్తంలో నుండి ఉక్రెయిన్ కు సాయం చేయాలని నిర్ణయం



న్యూఢిల్లీ మే 24 (నిఘా న్యూస్): రష్యా సైనికులు ఉక్రెయిన్‌లో నగరాల మీదుగా ముందుకు సాగుతున్నారు. దీంతో పాశ్చాత్య దేశాలు ప్రత్యక్ష యుద్ధానికి దిగకుండా రష్యాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికా రష్యాపై పలు ఆంక్షలు విధించి పశ్చిమ దేశాల ఆస్తులు, విదేశీ నిల్వలను మిగతా2లో..

## కిషన్ రెడ్డి...కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్..!

### త్వరలో 25 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారని కిషన్ రెడ్డి వ్యాఖ్య

కిషన్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తామన్న జగ్గారెడ్డి

బిఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక జరిగితే సన్మానిస్తా

కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి వ్యాఖ్య



సంగారెడ్డి మే 24 (నిఘా న్యూస్): కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్‌గా కిషన్‌రెడ్డి మారారని పొగడ్తలు కురిపించారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలను సంతోషంగా స్వాగతిస్తున్నానని మిగతా2లో..

## బిఆర్ఎస్‌వి... బేవకూఫ్ మాటలు

### హత్యలు జరగడం తప్పేనన్న జూపల్లి

శ్రీధర్ రెడ్డి ఎలాంటి వాడో ఊరికి వెళ్లి అడగండని కోరారు

కేటీఆర్‌పై పరువునష్టం దావావేస్తా

మంత్రి జూపల్లి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ మే 24 (నిఘా న్యూస్): కేటీఆర్ క్షమాపణ చెప్పాలి లేదంటే పరువు నష్టం దావా వేస్తా అని మంత్రి జూపల్లి కష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఓ యువరాజు, మొన్నటి వరకు కేసీఆర్ ని తిట్టని తిట్టు తిట్టిన ఆర్ఎస్ ప్రవీణ్ నేడు కేసీఆర్ పంచన చేరారని మండిపడ్డారు. చనిపోయిన శ్రీధర్ రెడ్డి దుర్మార్గుడు కాదన్నారు. హత్య బాధాకరం అన్నారు. కేటీఆర్ నిన్న ఏం జరిగిందో పూర్తి వివరాలు రానివ్వండి అన్నారు. మళ్ళీ నాపై మిగతా2లో..



## పెంపుడు మనుషులతో అబద్ధపు ప్రచారాలు

### నన్ను మంత్రిగా చూసి ఓర్చుకోలేక పోతున్నారు

### బిఆర్ఎస్‌పై మంత్రి సీతక్క మండిపాటు

హైదరాబాద్ మే 24(నిఘా న్యూస్): పెంపుడు మనుషులను పెట్టుకుని బీఆర్ఎస్ వాళ్లు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. తీన్మార్ మల్లన్న పై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి జైల్లోకి పంపిందన్నారు. ఈ క్రవారం ఆమె మాట్లాడుతూ.. వందల కోట్లు ఖర్చుపెట్టి మిగతా2లో..

## ఆడబిడ్డల ఉసురు తగులుతది

(మొదటిపేజీ తరువాయి)

పలు వ్యాఖ్యలు చేశారు. జగన్ నీకు సిగ్గుందా నీకు ఆడబిడ్డల ఉసురు తగులుతది. నా అక్కలు, నా చెల్లెమ్మలు, నా తల్లులు, నా అవ్వలు అంటూ జబ్బలు చరిచి, మైకుల ముందు గొంతు చించుకుని మొసలి కన్నీరు కార్చి, ఫేక్ ప్రేమలు ఒలకబోసే ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో మీ పానలో మహిళల భద్రత విషయమై దేశమంతా చెప్పుకుంటోంది. లండన్ లోని వీధులలో పొర్లుదండాల మధ్య విహరిస్తున్న మీకు.. ఇక్కడి ఆర్తనాదాలు, హాహాకారాలు వినపడవు. రాష్ట్రానికి ఈ అత్యున్నత ర్యాంకులు మీ వల్ల రావు. మీరు, మీ మంత్రులు, ఇతర నేతలు సిగ్గుతో తలదించుకుంటారో.. లేక సిగ్గులేకుండా మిన్నకుండి పోతారో ననేది ప్రజలు గమనిస్తున్నారు అంటూ ఆమె తీవ్ర స్థాయిలో మండిపడింది అంటూ ఆ వార్తా కథనాల్లో పేర్కొన్నారు.

## నేడు ఆరో దశ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

లాల్‌గంజ్, అజంగఢ్, జౌన్‌పూర్, మఛ్లిషహర్, భదోహి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తమ్లుక్, కంఠి, ఘటల్, ఝర్‌గ్రామ్, మేదినీపూర్, పురూలియా, బంకురా, బిష్ణుపూర్ హర్యానా రాష్ట్రంలోని అంబాలా, కురుక్షేత్ర, సిర్సా, హిసార్, కర్నాల్, సోనిపట్, రోహ్తక్, భివానీ-మహేంద్రగఢ్, గుర్గావ్, ఫరీదాబాద్ జార్ఖండ్ రాష్ట్రంలోని గిరిడి, ధన్‌బాద్, రాంచీ, జంషెడ్‌పూర్ బీహార్ రాష్ట్రంలోని వాల్మీకి నగర్, పశ్చిమ్ చంపారన్, పూర్వి చంపారన్, షెయోహర్, వైశాలి, గోపాల్‌గంజ్ , శివన్, మహారాజ్‌గంజ్ ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్, పూరి, ఢెంకనల్, కియోంజర్ , కటక్, సంబల్పూర్ జమ్మూ కశ్మీర్ (కేంద్రపాలిత ప్రాంతం) లో అనంతనాగ్-రాజౌరి ఢిల్లీ (కేంద్రపాలిత ప్రాంతం) లో చాందినీ చౌక్, ఈశాన్య ఢిల్లీ, తూర్పు ఢిల్లీ, న్యూఢిల్లీ, వాయువ్య ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీలలో జరుగనున్నాయి.

## ప్రజ్వల్‌ను దేశం దాటించిన దేవేగౌడ

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గురువారం దేవెగౌడకు ఎక్స్ వేదికగా ప్రజ్వల్ రేవణ్ణకు లేఖ రాశారు. వెంటనే ఇండియా తిరిగి వచ్చి పోలీసుల ముందు లొంగిపోవాలని, లేకుంటే నా ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని లేఖలో ఆయన పేర్కొన్నారు. తన సహనాన్ని పరీక్షించొద్దని ఆయన హెచ్చరించారు. గత నెలలో ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన వేల సంఖ్యలో సెక్స్ టేపులు వెలుగులోకి వచ్చాయి. హసన్ జిల్లాలో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో ఈ వీడియోలు వైరల్ అయ్యాయి. రేవణ్ణ ఇంట్లో పనిచేసే మహిళ, ప్రజ్వల్ రేవణ్ణతో పాటు ఆయన తండ్రి హెచ్‌డీ రేవణ్ణలపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఈ పరిణామాల అనంతరం ప్రజ్వల్ ఇండియా నుంచి జర్మనీ పారిపోయాడు. ఈ కేసును విచారించేందుకు కర్ణాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం ప్రజ్వల్‌కి లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. ఇదిలా ఉంటే ఇటీవల ప్రజ్వల్ దౌత్య పాస్‌పోర్టు రద్దు చేయాలని కోరుతూ సీఎం సిద్దరామయ్య, ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. కేంద్రం కూడా ప్రజ్వల్ రేవణ్ణ దౌత్య పాస్‌పోర్టు రద్దు ప్రక్రియకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తోంది.

## రాష్ట్ర అవతరణ వేడుకలకు ఇసి అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ సన్మానించే అవకాశం ఉంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఈసీ ప్రభుత్వానికి అనుమతి ఇవ్వడంతో, అందుకు తగిన విధంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ నున్నట్లు తెలిపారు. సీఎం ముందుగా గన్ పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలను కేటాయించేటప్పుడు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం పరిసర పారంతాలలో పారిశుధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు.

## బిఆర్ఎస్‌వి... బేవకూఫ్ మాటలు



(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలు చేశాడని మండిపడ్డారు. రాజకీయంగా వాడుకోవడం కోసం నాపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీధర్ రెడ్డి ఎలాంటోడో ఊరికి వెళ్లి అడగండని తెలిపారు. ఆయన ప్రవర్తనతో ఊరు కూడా విసుగు ఎత్తిందన్నారు. కానీ హత్య తప్పన్నారు. నేను బీఆర్ఎస్ వ్యతిరేకించానన్న కసితో నాపై దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నాడు కేటీఆర్ అంటూ మండిపడ్డారు. ఎఫ్ఐఆర్ లో భూముల వివాదం ఉందని, అన్నదమ్ముల పంచాయితీకి నాకేం సంబంధం లేదన్నారు. ఎఫ్ఐఆర్ కాపీలను, ఆర్ఎస్ పికి పంపిస్తా అని జూపల్లి అన్నారు. మా కార్యకర్తను కూడా చంపారన్నారు. నీలాగే నేను ఆరోపణలు చేయలేదన్నారు. బట్టకాల్చి మీద వేస్తాం అంటే ఏం రాజకీయం చేస్తున్నట్టు అన్నారు. నెరేళ్లలో దళితులని ఇసుక అక్రమ దందా అపారని కేటీఆర్ ఎంత హింస పెట్టారో అందరికి తెలుసన్నారు. అలాంటి వ్యక్తి నా పై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. రాజకీయంగా ఎలాంటి అంశం లేదని ఏదేదో ఆరోపణలు చేస్తున్నాడన్నారు. కేటీఆర్, గండ్రపల్లి ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బుద్ధి జ్ఞానం ఉండాలన్నారు. చదివిన చదువుకు సంస్కారం ఉండాలి కేటీఆర్ అంటూ మండిపడ్డారు. సీబీఐ విచారణతో కాకుంటే జ్యూడిషియల్ విచారణకు కూడా సిద్ధం అన్నారు. మీకు దమ్ముంటే ఆ గ్రామంలోకి వచ్చి ప్రజలను అడుగు, నిజం తెలుసుకో అంటూ సవాల్ విసిరారు. గ్రామంలో ప్రజలను అడుగుదాం బేవకూఫ్ మాటలు మాట్లాడుతున్నావు అంటూ మండిపడ్డారు.

## పెంపుడు మనుషులతో అబద్ధపు ప్రచారాలు


(మొదటిపేజీ తరువాయి)

ఆరోజు నన్ను ఎమ్మెల్యేగా గెలవకుండా చేయాలని ప్రయత్నం చేశారన్నారు. ఈరోజు తీన్మార్ మల్లన్న పై కూడా అలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఆదివాస బిడ్డనైన నన్ను మంత్రిగా చూసి కొంతమంది ఓర్చుకోలేకపోతున్నారన్నారు. మొదటి విడుతగా సన్న బియ్యానికి 500 రూపాయలు బోనస్ ప్రోత్సాహకంగా ప్రకటించామని తెలిపారు. దొడ్డు వడ్లను కొనమని ఏ ఒక్క సందర్భంలో అనలేదని స్పష్టం చేశారు. తినడానికి ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొంటుందని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఫస్ట్ తారీకు రాగానే అందరికీ జీతాలు ఇస్తున్నామని వెల్లడించారు. రైతుల సమస్యలను, నిరుద్యోగుల సమస్యలు ప్రతి ఒక్కటి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.కాగా.. ఉమ్మడి నల్గొండ- ఖమ్మం -వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఉప ఎన్నికల్లో చింతపండు నవీన్ గారిని బలపరుస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్ రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్ లు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల పట్టభద్రులు తప్పకుండా సీపీఎస్ రద్దు -పాత పెన్షన్ పునరుద్ధరణ కషి చేసే మల్లన్న ను మొదటి ప్రాధాన్యత ఓటు తో గెలిపించాలన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి తీన్మార్ మల్లన్న తప్పకుండా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ఏడాదిలోగా... మోడీ రిటైర్మెంట్..!

(మొదటిపేజీ తరువాయి)

సొంత పార్టీలో జరుగుతున్న చర్చ, అటు విపక్షాలకు కౌంటరిచ్చేశారు మోదీ. ఇటీవల ఓ జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. దేవుడు తనకు మార్గం చూపించాడని, శక్తి ఇస్తున్నాడని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిస్తాననే పూర్తి విశ్వాసం ఉందన్నారు. అప్పటివరకు దేవుడు తనను వెనక్కి పిలవడని అనుకున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలో ఇక్కడ తప్ప మరెక్కడా తనకు చోటు లేదని వ్యాఖ్యానించారు ప్రధాని మోదీ. మోదీ నేతత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పద్ధతిని తీసుకొచ్చారు. 75 ఏళ్లు నిండిన వారు రాజకీయాల నుంచి రిటైర్మెంట్ ఇవ్వాలనే నిబంధన తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్‌జోషి, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్పతోపాటు మరికొందరు నేతలు రాజకీయాలకు దూరమయ్యారు. ఈ లెక్కన మరో ఏడాదితో మోదీ రిటైర్మెంట్ సమయం వచ్చేసింది. ఈ విషయాన్ని సొంత పార్టీలోని నేతలు చర్చించుకోవడం మొదలైంది. మోదీ తర్వాత అమిత్ షాతోపాటు పలువురు నేతలు ఆయన కుర్చీ కోసం పోటీ పడుతున్నట్లు ఢిల్లీ సర్కిల్స్‌లో వార్తలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో ఆయా వార్తలకు ప్రధాని మోదీ ఈ విధంగా ఫుల్‌స్టాప్ పెట్టారు. యూపీలోని ఎన్నికల సభలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో పెద్దవాళ్లకు రిటైర్‌మెంట్ వయసు దగ్గరకు వచ్చిందని మహా అంటే ఏడాది మాత్రమే ఉంటారన్నారు. దీని తర్వాత ఒడిషా సీఎం నవీన్ పట్నాయక్ వయసును ఉద్దేశించి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనకు 77 ఏళ్లు వచ్చాయని, అనేక సమస్యలు వెంటాడుతాయని, రాజకీయాల నుంచి తప్పుకుంటే బాగుంటుందని ఒడిషా ప్రచారంలో చెప్పుకొచ్చారు. దానికి కాంగ్రెస్ పార్టీ నుంచి కౌంటర్లు పడిపోయాయి. మోదీ తర్వాత ఆ కుర్చీ కోసం అమిత్‌షా పోటీ పడుతున్నారని చిదంబరం తనదైన శైలిలో సెటైర్లు వేశారు. ఎన్నికల వేళ జరుగుతున్న ఈ తరహా ప్రచారానికి ప్రధాని మోదీ తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారని అంటున్నారు. మరి బీజేపీలో మిగతా నేతల మాటేంటన్నది కొత్త సమస్య. కాగా ప్రధాని మోడీ శుక్రవారం హిమాచల్‌ప్రదేశ్ మండీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా చివరి విడతలో జూన్ 1న మండీ నియోజకవర్గానికి పోలింగ్ జరగనుంది. ఈ సందర్భంగా మండీలో ప్రధాని మోడీ భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండి బీజేపీ అభ్యర్థి, బాలీవుడ్



నటి కంగనా రనౌత్ ప్రధానికి గులాబీ పువ్వుతో స్వాగతం పలికారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు షేర్ చేశారు. ప్రధాని మోడీ స్టేజ్ మీదకు రాగానే కంగనా రనౌత్ నమస్కారం చేసి ఎర్ర గులాబీని అందజేశారు. సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేస్తూ మండీకి స్వాగతం అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఇక కంగనా రనౌత్ క్రీమ్ చీరతో హిమాచలీ టోపీని ధరించారు. ఇక ఈ కార్యక్రమానికి స్థానికులు భారీగా తరలివచ్చినట్లు కంగనా ఫొటోలు పంచుకున్నారు. ఈ పోస్ట్‌పై ఓ అభిమాని చాలా అద్భుతం అని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరుగుతోంది. ఇప్పటికే ఐదు దశల పోలింగ్ ముగిసింది. ఆరో విడత శనివారం జరగనుంది. చివరి విడత జూన్ 1న జరగనుంది. మండీ నియోజకవర్గానికి కూడా జూన్ 1న పోలింగ్ జరగనుంది. ఇక ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదల కానున్నాయి.

## కిషన్ రెడ్డి... కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్..!

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రభుత్వ పాలన బాగుందని కిషన్ రెడ్డి ఒప్పుకున్నందుకు సంతోషమని ప్రశంసించారు. గాంధీభవన్‌లో జగ్గారెడ్డి శుక్రవారం విరీడియాతో మాట్లాడారు. కిషన్ రెడ్డికి వ్యవసాయ శాఖపై ఎలాంటి అవగాహన లేదని చెప్పారు. ధాన్యం మద్దతు ధర కేంద్రం నిర్ణయిస్తుందనే కనీస అవగాహన కిషన్ రెడ్డికి లేదన్నారు. 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని కిషన్ రెడ్డి అన్నారన్నారు. ప్రభుత్వ పాలన నచ్చే 25 మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కిషన్ రెడ్డి ఒప్పుకున్నారని చెప్పారు. దివంగత ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయ్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వ్యక్తి కిషన్ రెడ్డి అని కొనియాడారు. అధికార పార్టీలు మంచి చేస్తే మెచ్చుకునే గుణం వాజ్‌పేయ్ లాగే కిషన్ రెడ్డికి వచ్చిందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టలేరన్నారు. ఎన్ని ప్రయోగాలు చేసిన బీజేపీకి తెలంగాణలో స్థానం లేదన్నారు. మోదీ ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ రాష్ట్రం బట్టలు, టోపీలు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదని జగ్గారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ కు చెందిన 25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతున్నారని





చెప్పినందుకు కిషన్ రెడ్డి మాటలు స్వాగతిస్తున్నామని.. అదే జరిగితే సన్మానిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి అన్నారు. కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి బ్రాండ్ అంబాసిడర్ ఐనట్టున్నారు. ఐదేళ్లు సీఎం రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం సేఫ్. ప్రభుత్వాలను పడగొట్టే దాంట్లో బీజేపీ నేతలు ప్రొఫెసర్లు. తెలంగాణలో బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా పడగొట్టే అవకాశం లేదు. బీజేపీ మళ్ళీ కేంద్రంలో అధికారంలోకి రాదని తేలిపోయింది. అందుకే రోజుకో భాష రోజుకో వేషం మారుస్తున్నారు. కిషన్ రెడ్డి చాలా గొప్పవారు. అటల్ బీహార్ వాజ్ పాయ్ దారిలో నడుస్తున్నట్టు కనిపించింది. మంచి పని చేస్తే ప్రతిపక్షంలో ఉన్నా ప్రశంసించే గుణం వాజ్‌పాయ్ ది. నిండు పార్లమెంట్ లో ఇందిరాగాంధీని దుర్గమాతతో పోల్చారు. 25 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతున్నారు అంటే, ఐదు నెలల కాంగ్రెస్ పాలన బాగుందని అర్థం. కాంగ్రెస్, రాష్ట్రంలో మంచి పాలన ఉందని ప్రశంస మాకు మంచిదేనని ఆయన పేర్కొన్నారు. బీజేపీ లో ఉన్న ఐదుగురిలో కూడా కొందరు బయటకు వస్తారని జగ్గారెడ్డి ఆరోపించారు. రంజాన్ రోజు ముస్లింలు మా ఇంటికి బిర్యానీ పంపించే వాళ్ళు అని మోడీ చెప్పారు. ప్రభుత్వం రాదని భయం పట్టుకుని మాట్లాడుతున్నారు. వేషం మారింది ,బాషా మారింది. వంగి వంగి దండాలు పెడుతున్నారు మోడీ. కేటీఆర్ ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి మాట్లాడుతున్నరు. కేటీఆర్ మాట్లాడినా హరీష్ మాట్లాడినా రేవంత్ విరీద బురద జల్లడమే. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు విరీరు కూడా దందా చేశారా, విరీరు చేశారు కాబట్టి మేము కూడా చేస్తాం అనుకుని మాట్లాడుతున్నాడు కేటీఆర్. తెలంగాణలో హత్యా రాజకీయాలు లేవు ప్రభుత్వం దాన్ని ప్రోత్సహించదు. కేటీఆర్, జూపల్లి విరీద అభాండాలు వేస్తున్నారు. రాజకీయ విలువల గురించి కేటీఆర్ మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంటుందన్నారు.

## 75 ఏళ్లకు... రిటైర్మెంట్ తప్పదన్న అమిత్ షా



(మొదటిపేజీ తరువాయి)

పక్కన పెడతారన్నారు. అందుకు సంబంధించిన ప్రచారం సైతం ఇప్పటికే ప్రారంభ మైందని చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలో మీడియాకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ మాట్లాడారు. 2019లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేజ్రీవాల్ గుర్తు చేశారు. బీజేపీలో 75 ఏళ్లు వచ్చినా ఆ వయస్సు దాటిన నాయకులంతా తప్పకుండా రిటైర్ కావాల్సిందేనని అమిత్ షా స్పష్టం చేశారన్నారు. అందులో ఎటువంటి రాజీ లేదని అమిత్ షా చెప్పారన్నారు. కావాలంటే, నాడు అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యలు ఇంటర్నెట్‌లో చెక్ చేసుకోవచ్చునంటూ కేజ్రీవాల్ సూచించారు. అయితే ఆ రూల్ ప్రకారమే బీజేపీలోని సీనియర్లు ఎల్ కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి, సుమిత్రా మహాజన్ తదితరులంతా పార్టీ నుంచి తప్పుకున్నారన్నారు. ఇటువంటి నేపథ్యంలో బీజేపీలో ప్రస్తుతమున్న నాయకాగణం సైతం ఆ రూల్ ప్రకారం నడుచుకోవాల్సిందేనని కేజ్రీవాల్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో ఈ ఏడాది మార్చి 21న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆయన తీహాడ్ జైలుకు తరలించింది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన పార్టీ తరఫున ప్రచారం చేసుకోవాలంటూ సుప్రీంకోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ వేశారు. నేపథ్యంలో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఇటీవల కండిషన్లతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం ఢిల్లీలోని తన పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా బీజేపీ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకొని కేజ్రీవాల్ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇందులోభాగంగా 2025, సెప్టెంబర్ 17వ తేదీతో ప్రదాని నరేంద్ర మోదీకి 75 ఏళ్లు వస్తాయన్నారు. బీజేపీ పెట్టుకున్న రూల్ ప్రకారం 75 ఏళ్లు వచ్చిన వారు రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవాల్సి ఉంటుదన్నారు. ఆ క్రమంలో మోదీ రిటైర్‌మెంట్ కాక తప్పదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విరీ పార్టీ ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరంటూ బీజేపీ నేతలకు సూటిగా కేజ్రీవాల్ సవాల్ విసిరారు. దీనిపై కేంద్ర మంత్రి అమిత్ షా స్పందించారు. మూడోసారి కూడా ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీనే ఉంటారని అమిత్ షా స్పష్టం చేశారు. అటువంటి వేళ కేజ్రీవాల్ బీజేపీలో అమిత్ షాను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టేందుకు మోదీ ప్రణాళికాబద్దంగా ముందుకు వెళ్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు.

## త్వరలో మేడిగడ్డకు రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ మే 24(నిఘా న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డను సందర్శించ నున్నారు. వచ్చేవారం ఆయన పర్యటన ఉండనుంది. ఏ రోజున సీఎం విజిట్ చేస్తారనేది రెండు రోజుల్లో తెలియనుంది. ఈ టూర్‌లో భాగంగా ఏ మేరకు డ్యామేజ్ అయ్యింది, పనులకు ఎంతకాలం పడుతుందని అనేదానిపై ఓ అంచనాకు రానున్నారు. తాజాగా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోని ప్రధాన బ్యారేజ్ మేడిగడ్డ మరమ్మతులను వేగం చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సచివాలయంలో నిర్మాణ సంస్థ ప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు, సీడబ్ల్యూసీ ఇంజనీర్లుతో ఆయన సమావేశం నిర్వహించారు. మేడిగడ్డ పునరుద్ధరణ పనులపై ఇటీవల జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షణ సంస్థ ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా పనులు కొనసాగించాలని ఆదేశించారు. వర్షాలు వచ్చేలోగా తాత్కాలిక పనులను పూర్తి చేయాలని సూచన చేశారు. ముఖ్యంగా మేడిగడ్డ పనులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అదే సమయంలో అటు అన్నారం, సుందిళ్ల వద్ద పనులను చేపట్టాలన్నారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని అధికారులను కోరారు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చేవారం మేడిగడ్డ బ్యారేజ్‌ని సందర్శిస్తారని చెప్పుకొచ్చారు. ఇదిలా వుండగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు సూచనలు, సలహాలు అందించేందుకు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో కూడిన కమిటీని నీరుపారుదల శాఖ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ ఆదేశాల ప్రకారం ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ నీటిపారుదల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఆయా ప్రాజెక్టులను సందర్శించి సమగ్ర అధ్యయనం చేశాక కమిషన్‌కు నివేదిక ఇవ్వనుంది. ఇదిలావుండగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద మళ్లీ ప్రకంపనలు వచ్చాయి. కుంగిన ఏడో బ్లాకులోని 16వ నెంబరు గేటును ఎత్తడానికి నీటిపారుదల శాఖ అధికారులు ప్రయత్నించారు.అయితే బ్యారేజీ కింద నుంచి భారీగా ధ్వనులు రావడంతో వెంటనే ఆ పనులను నిలిపివేశారు. అక్కడి సెన్సార్లు సైతం శబ్దాలను గుర్తించి అలర్ట్ చేశాయి. దీంతో బ్యారేజీ పెను ప్రమాదానికి లోనయ్యే అవకాశముందని ఆ శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## తీన్మార్ మల్లన్న చేసేవన్నీ లంగ పనులే

**నల్లగొండ మే 24(నిఘా న్యూస్):** మోసపోతే గోస పడుతాం అని చెప్పినం. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోవిచక్షణతో ఓటెయ్యాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నకిరేకల్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్ల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ అని చెప్పి పచ్చి మోసం చేశాడు. ధాన్యం బోనస్ విషయంలో కూడా మాట తప్పిండని విమర్శించారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ అంటూ అన్ని బోగస్ మాటలు మాట్లాడుతున్నాడని సీఎంపై మండిపడ్డారు. ఆరు గ్యారంటీలతో అభూతకల్పనలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇన్ని అబద్దాలు ఆడుతున్న కాంగ్రెస్‌కు ఓటుతో సరైన బుద్ధి చెప్పాలన్నారు. అలాగే విద్యుత్ కూడా సరిగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఓట్లప్పుడు మాత్రమే రైతుబంధు ఇస్తుండు, మహిళలకు రూ.2,500 ఇస్తా అని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కూడా నిర్లజ్జగా అబద్దాలు




ఆడుతున్నారని ఘాటుగా విమర్శించారు. దేవుళ్ల విరీద ఓట్లు వేస్తూ రేవంత్ రెడ్డి పూటకో అబద్ధం అడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఉద్యోగాలు ఇచ్చినం అని అబద్దాలు అడుతున్నాడు. 30 వేల ఉద్యోగాలు కేసీఆర్ రిక్రూట్మెంట్ చేస్తే వాటికి కాగితాలు పంచుతూ సీఎం అబద్దాలు అడుతున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి గొప్ప విద్యావంతుడు అతనికి ఓటేస్తే ప్రభుత్వంపై కొట్లాడుతాడని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి పచ్చి బ్లాక్ మెయిలర్. అతను అబద్దాలు ఆడే వ్యక్తి. 56 క్రిమినల్ కేసులు ఉన్నాయని గుర్తు చేశారు. అమ్మాయిలు పెట్టిన కేసులే పది దాకా ఉన్నాయి. అతను చేసేవి అన్నీ లంగ పనులేనని ఘాటు విమర్శించారు. అతన్ని చట్టసభల్లోకి రానివ్వకుండా బుద్ధి చెప్పాలన్నారు. జీవో 46 ని రద్దు చేసేందుకు మా ప్రభుత్వంలో అన్నీ సిద్ధం చేసినం. దురదృష్టవశాత్తు అప్పటికే ఎన్నికల కోడ్ వచ్చింది. ప్రాసెస్ అంతా నిలిచిపోయింది. ఇప్పుడు ఆ జీవోను రద్దు చేసేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## అమెరికా ఆస్తులను జప్తు చేయనున్న రష్యా

(మొదటిపేజీ తరువాయి)

స్తంభింపజేసింది. ఉక్రెయిన్‌కు సాయం చేసేందుకు ఈ ఫ్రీజ్ మనీ కూడా ఇస్తున్నారు. ఇప్పుడు రష్యా కూడా ఇదే తరహాలో తన ప్రతీకారం తీర్చుకుంది. అమెరికా ఆస్తులను జప్తు చేయాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలే 7 సభ్య దేశాలు రష్యా ఆస్తులలో సుమారు 300 బిలియన్ డాలర్లు ఉక్రెయిన్‌కు సహాయం చేయడానికి ఉపయోగించాలని నిర్ణయించాయి. యూరోపియన్ యూనియన్ కూడా స్వాధీనం చేసుకున్న ఆస్తులపై వడ్డీ నుండి ప్రతి సంవత్సరం ఉక్రెయిన్‌కు 2.7-3.3 బిలియన్ డాలర్ల సహాయాన్ని పంపుతుందని ఈ వారం ప్రారంభంలో ప్రకటించింది. రష్యాకు వ్యతిరేకంగా పాశ్చాత్య దేశాలు నిరంతరం ఇటువంటి చర్యలు తీసుకుంటున్నాయి. దీనిపై పుతిన్ స్పందిస్తూ ఓ ప్రతిపాదనపై సంతకం చేశారు. ఈ ప్రతిపాదన రష్యా సరిహద్దుల్లో ఉన్న అమెరికా ఆస్తులపై రష్యా క్లెయిమ్‌లను అనుమతిస్తుంది. రష్యా ఆస్తులను ఎందుకు జప్తు చేస్తోంది. అమెరికాలోని రష్యన్ చర, స్థిరాస్తులను జప్తు చేయడం వల్ల కలిగే



నష్టాలు. అమెరికన్ కంపెనీలలో రష్యన్ కంపెనీల వాటాలు ఈ అమెరికన్ ఆస్తుల నుండి భర్తీ చేయబడతాయి. రష్యా మీడియా ఈ సంవత్సరం ప్రారంభంలో క్రెమ్లిన్ సుమారు 290 బిలియన్ డాలర్ల దాని కూటమి ఆస్తులను గుర్తించిందని ఆస్తుల స్తంభనలను ఆఫ్‌సెట్ చేయడానికి స్వాధీనం చేసుకోవచ్చని పేర్కొంది. రష్యా ఇప్పటికే అనేక విభిన్న పాశ్చాత్య కంపెనీల భౌతిక ఆస్తులను రష్యాలోని యూరోపియన్ బ్యాంకుల వద్ద ఉన్న మిలియన్ల డాలర్లను స్వాధీనం చేసుకుంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి రష్యాలో పనిచేస్తున్న వేలాది పాశ్చాత్య కంపెనీలు దేశం విడిచిపెట్టాయి. 7 దేశాలైన కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్,యూరోపియన్ యూనియన్‌ల ముందు ఉక్రెయిన్‌కు సహాయం చేయడానికి అమెరికా ఒక ప్రణాళికను సమర్పించింది. దీని కింద రష్యా ఆస్తులు ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్ల సహాయం అందించడానికి ఉపయోగించబడతాయి. ఈ అమెరికన్ ప్రతిపాదన కాంగ్రెస్‌లో ఆమోదించబడింది. అధ్యక్షుడు బిడెన్ గత వారం ఈ చట్టంపై సంతకం చేశారు. ఆ తర్వాత అమెరికా రష్యా ఆస్తులను జప్తు చేసి ఉక్రెయిన్‌కు సహాయం చేయడానికి ఉపయోగించుకోవచ్చు. అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థలో రష్యా సెంట్రల్ బ్యాంక్ ఆస్తులలో కనీసం 5 బిలియన్ డాలర్లను టాస్క్ ఫోర్స్ గుర్తించింది. జర్మనీ కూడా అమెరికా ప్రణాళికను స్వీకరించి జర్మనీలోని రష్యన్ ఆస్తులను స్వాధీనం చేసుకుంటుందని సూచించింది.

# తీన్మార్ మల్లన్న గెలిపించండి

## అనంతగిరిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**కోదాడ, మే 24 (నిఘా న్యూస్):** రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి ఆదేశానుసారం మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గోండ్రియాల, లక్కవరం గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధ్యాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొండపల్లి వాసు మండల నాయకులు బుర్ర పుల్లారెడ్డి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు మండల సీనియర్ నాయకులు దేగ కొండయ్య బుర్ర నర్సిరెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులు నాగుల మీరా మందపల్లి వెంకటేశ్వర్లు గొట్టేముక్కుల శేషయ్య నెల్లూరి ప్రభాకర్ రావు నెల్లూరి వినయ్ ఏటుకూరి రమేష్ చుంచు మురళి కలకొండ కోటేశ్వరరావు దండమూడి రవి ఏపూరి ముత్యాలరావు బండ్ల మల్లయ్య కొడారు రాధాకృష్ణ గంగూరి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల బదిలీలను చేపట్టాలి

## తెలంగాణ జన సమితి

## జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్ పాష



**వనపర్తి, మే 24 (నిఘా న్యూస్):** వేసవి సెలవులు ముగిసే లోపే రాష్ట్రంలోని ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని తెలంగాణ జన సమితి పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎంఏ.ఖాదర్ పాష కోరారు. రాష్ట్రంలోని ఉద్యోగుందరికీ మేలు చేయాలని గత ఆరు సంవత్సరాల క్రితం 2018లో ఉద్యోగుల బదిలీలు జరిగాయని చెప్పారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరగవలసిన సాధారణ బదిలీల ప్రక్రియలను గత ప్రభుత్వం చేపట్టలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విద్యా సంవత్సరానికి ఇబ్బంది కాకుండా బదిలీలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈసీ అనుమతితో రాష్ట్ర ఉద్యోగుల బదిలీలు తక్షణమే చేపట్టాలని లేని పక్షంలో ఉద్యోగ సంఘాలతో కలిసి తగు కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన హెచ్చరించారు.

# మాజీ ఎమ్మెల్యే జయ రాములు వర్ధంతి



**వనపర్తి, మే 24 (నిఘా న్యూస్):** వనపర్తి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జయరాములు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు కోరారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే జయరాములు 39వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. జయ రాములు సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏంవైఎస్ ఫంక్షన్ హాల్ లో జయరాములు వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక, బీసీ సంఘాలు, బహుజన సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు దామాషా ప్రకారం చట్టసభల్లో, రాబోయే స్థానిక సంస్థల్లో వాటాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, స్వేరో రాష్ట్ర నాయకులు కిరణ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, హైకోర్టు అడ్వకేట్ ప్రతాప్, లెక్చరర్స్ ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ షాష, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు గంధం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే ప్రజా గొంతుక దళిత బహుజన ఫ్రంట్

## హసన్పర్తిలో డిబిఎఫ్

## రాష్ట్ర మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ




**హసన్‌పర్తి, మే 24 (నిఘా న్యూస్):** సమాజంలో వివక్షతకు గురవుతున్న దళిత,పీడిత, అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ వారి తరపున ప్రశ్నించే ప్రజా గొంతుకగా దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) నిలుస్తుందని,ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలందించే సంక్షేమ ఫలాలు కింది స్థాయి కులాలకు అంద విధంగా వారధిగా డిబిఎఫ్ పనిచేస్తుందని, దళిత బహుజన ఫ్రంట్(డిబిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ అన్నారు. శుక్రవారం హసన్‌పర్తి మండల కేంద్రములో ఈ నెల 30న జరిగే డిబిఎఫ్ రాష్ట్ర నాలుగవ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ క్రమంలో ఈ నెల 30వ తేదీన హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిబీఎఫ్ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు జరుపుకుంటున్నదని, ఈ మహాసభలకు జిల్లా నుండి అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్,జిల్లా అధ్యక్షులు మాదాసి సురేష్, కార్యదర్శి చుంచు నరేష్, రాష్ట్ర మహిళ కార్యదర్శి బొర్ర సంపూర్ణ, జిల్లా మహిళ కార్యదర్శి మేకల అనిత నాయకులు ప్రభాకర్, పోలేపాక మల్లేశం రాజు,శ్రీకర్ సుమన్,కృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# పొంగులేటి వర్గాన్ని వేదిక దింపిన ఎమ్మెల్యే

## మండల కేంద్రంలో పొంగులేటి కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు



**కారేపల్లి, మే 24 (నిఘా న్యూస్):** సింగరేణి మండలం కేంద్రంలో త్వరలో రెవిన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కాంక్షిస్తూ గురువారం వై ఎస్ ఎన్ గార్డెన్ నందు ఖమ్మం, వరంగల్, నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ వర్గానికి, మంత్రి శ్రీనివాస్ రెడ్డి వర్గానికి ఎమ్మెల్యే సమక్షంలోనే వాదోపవాదాలు జరిగాయి. ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్యే అనుచరులు మంత్రి శ్రీనివాస్ రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేయడంపై శ్రీ మనస్థాపానికి గురై మంత్రి పొంగు లేటి అనుచరులు సన్నాక సమావేశంలో పాల్గొన్న లేదు. ఎమ్మెల్యే కూడా ఏకపక్షంగా తన వర్గానికి మద్దతు పలికి పొంగులేటి అనుచరులను వేదిక దిగండి అంటూ హూకు%శీ% జారీ చేశారు. దీంతో కంగుదీన్న పొంగులేటి వర్గం సమావేశంలో పాల్గొన్న కుంట వెళ్లిపోవడంతో ఎమ్మెల్యే అనుసరించిన తీరు పట్ల అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే తీరులో ప్రజలకు ప్రభుత్వం నుండి అందవలసిన పథకాలు సక్రమంగా చేరడానికి కార్యకర్తలను సన్నద్ధం చేయడం కోసం త్వరలో క్యాంపు కార్యాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు కనబడుతుంది. ఇరువర్గాలు గ్రూప్ తగాదాలతో నూతన కార్యాలయం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు చర్చ జరుగుతుంది. తీన్మార్ మల్లన్న గెలుపుకు కృషి ఫలిస్తుందా లేదా అనేది వెలుబడే ఫలితాలపై తీరు కనబడుతుంది.

# ఘనంగా నల్లమల 27వ వర్ధంతి



**కొత్తగూడెం, మే 24 (నిఘా న్యూస్):** కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కులకోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరిప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా మిగిలి పోయాడని,భూపోరాటాలకు నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత గిరిప్రసాదుకు దక్కుతుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సిపిఐ మాజీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ 27వ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గిరిప్రసాద్ చిత్రపఠానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాబీర్ మాట్లాడుతూ అప్పటి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధృవతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం, ఆయన చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేఖంగా ఆంధ్ర మహాసభ సాగించిన ఉద్యమం గురించి అధ్యయనం చేసి ఉన్నత విద్యను, ఆస్తులను సైతం వదిలివేసి ఉద్యమబాట పట్టిన నల్లమల సాయుధ పోరాటాన్ని బలోపేతం చేశాడని కొనియాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన గిరిప్రసాద్ జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమంకోసం నిరంతరం కృషి చేయాడన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలను నడిపించడంలో కీలకపాత్ర పోషించిన గిరిప్రసాద్ లేని లోటును పరిపూర్ణ చేయాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ప్రజాసంఘాల నాయకులు వట్టికొండ మల్లికార్జున్ రావు, జి వీరాస్వామి, కంచర్ల జమలయ్య, జక్కుల రాములు, భూక్యా శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ,ఎస్ కె ఫహీమ్,ఖయూమ్, సందెబోయిన శ్రీనివాస్, లింగేష్, పున్నంసింగ్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఆత్మబంధువు తీన్మార్ మల్లన్న: బర్రె జహంగీర్



భువనగిరి, మే 24 (నిఘా న్యూస్): ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించిన బర్రె జహంగీర్‌మాజీమున్సిపల్ చైర్మన్ ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, జిల్లాల పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పట్టభద్రుల ఆత్మీయ బంధువని ఆయన్ను గెలిపించాలని భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. భువనగిరి మున్సిపల్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థు లు పట్టభద్రుల ద్రోహులని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోఉద్యోగ నియామకాలు చేపట్టకున్నా, ఏనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని అన్నారు. తీన్మార్ మల్లన్న తన ఛానల్ ద్వారా నిరుద్యోగులపై, ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగించారని అన్నారు. అందుకోసమే ప్రభుత్వం మల్లన్నపై కక్ష గట్టి జైలుకు పంపిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఖాళీ పోస్టులను భర్తీ చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలకు పట్టభద్రులను ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కావున పట్టభద్రులంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రములో ఉడత రమేష్,ఉట్కూరి భరత్ గౌడ్,ఎండి ఇఫ్తాకర్,ఎండి జలీల్,చందుపట్ల విశేశ్వర్ రావ్,తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యులు రమేష్ యాదవ్ తదితరులు ప్రచారం చేసారు.

# తీన్మార్ మల్లన్నకు మున్నూరు కాపుల మద్దతు



**హైదరాబాద్, మే 24 (నిఘా న్యూస్):** నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు, న్యాయవాది మణికొండ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కాచిగూడ లోని మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర కార్యాలయంలోజరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశం జరిగింది. ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న తీన్మార్ మల్లన్న గత ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయారని, ఈసారి జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నందుకు అత్యధిక మెజారిటీతో తీన్మార్ మల్లన్న గెలిపించాలని పేర్కొన్నారు. మున్నూరుకాపు మహాసభ ఉపాధ్యక్షుడు, మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు, న్యాయవాది కొండూరు వినోద్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తి చూపినందున అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేసిన తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించి మున్నూరు కాపుల సత్తా చాటాలని కోరారు. మహాసభ ప్రత్యేక ఆహ్వానితులు, మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి, ప్రధాన కార్యదర్శి, పిసిసి ఓబీసీ విభాగము, ఉపాధ్యక్షులు కట్టెల సుభాష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం నాయకుడు, బడుగు, బలహీన వర్గాల వాణిని విధాన సభలో వినిపించడానికి తీన్మార్ ను మల్లన్న అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తీన్మార్ మల్లన్న గెలిపిస్తే మంత్రివర్గంలో స్థానం ఖాయం అని తెలిపారు. సమావేశములో మున్నూరుకాపు మహాసభ కార్యదర్శి, కొంతం సురేష్ బాబు, ఉపాధ్యక్షులు మణికొండ రమేష్ కుమార్, మించు ఆనంద్, ప్యాట రవీందర్, అయిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్నను గెలిపించండి



**అడ్డగూడూరు, మే 24 (నిఘా న్యూస్):** ఖమ్మం వరంగల్ నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రశ్నించే ప్రజా గొంతుక, ప్రజా సమస్యల గురించి నిరంతరం పోరాడే తీన్మార్ మల్లన్నను గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు రాచకొండ సతీష్ గౌడ్ అన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రభుత్వ ఉద్యోగులు, పట్టభద్రులు, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# నాలాలలో వ్యర్థాల తొలగింపు ముమ్మరం చేయాలి

## కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ



**మల్కాజిగిరి, మే 24 (నిఘా న్యూస్):** రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నాలాలలో వ్యర్థాలు తొలగింపు పనులు ముమ్మరం చేయాలని వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ అన్నారు. శుక్రవారం జీహెచ్ ఎంసీ సిబ్బంది ఆధ్వర్యంలో వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ రోడ్ నెంబర్ 7 లో చేపట్టిన డిసిల్టింగ్ పనులను ఆమె పరిశీలిం చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో డ్రైనేజీ కాల్వలలో వ్యర్థాలు తొలగింపు పనులు చేప ట్టడం జరుగుతుందన్నా రు. అలాగే కాలనీలో ప్రజలు కూడా ఓపెన్ నాలాలలోనూ, ఇళ్ళ ముంగిట చిన్న చిన్న డ్రైనేజీ కాల్వలలోను చెత్త కుప్పలను పారవేయ వద్ద ని సూచించారు. అలా పారబోస్తే వర్షా కాలంలో పారుదల నిలిచి పోయి, మీ ఇళ్ళ ముంగిట మ్యాన్ హోల్స్ ద్వారా మురుగు నీరు పారుతుందని తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి ప్రజలు కూడా తమ వంతు సహ కారం అందించాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ వినాయక్ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ ఓం ప్రకాష్, నాయకులు సాయి సురే ష్, గోపాల్, శివప్రసాద్, శివ,కాలనీ వాసులు హేమంత్, సృజన్,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులను పరిశీలించిన జెరిపోతుల



**మౌలాలి, మే 24 (నిఘా న్యూస్):** మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని ఇంద్రనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం దశల వారీగా చేపట్టి పూర్తి కాలనీలో చేపడతామని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తామని అన్నారు. కాలనీ మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గా రెడ్డి, శేఖర్ గౌడ్ మరియు కాలనీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# అక్రమాల మల్లన్న గుణపాఠం చెప్పండి

## బిఆర్ఎస్ మండల నాయకులు కొప్పుల



**పాలేరు, మే 24 (నిఘా న్యూస్):** ఈనెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్యాయాన్ని ప్రశ్నించే గొంతుకనంటూ స్వంత యుట్యూబ్ ఛానల్, పేపర్ పెట్టుకొని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులను, ప్రజాప్రతినిధులను బెదిరించి అక్రమాలకు పాల్పడిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను, పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలని బిఆర్ఎస్ మండల నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు, నిరుద్యోగులకు సామాన్య ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను చూస్తూ మౌనం వహిస్తు అందరినీ మోసం చేసిన తీన్మార్ మల్లన్న ప్రజల పక్షాన ఎక్కడ పోరాడాడని ఉపేందర్ రెడ్డి,అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుడు, ప్రజల మనిషి, ప్రజా సేవకుడు, ప్రశ్నించే గొంతుక వివాద రహితుడు ఉన్నత విద్యావంతులు రాకేష్ రెడ్డికి నిరుద్యోగ యువత మద్దతు ప్రకటించి 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి అవకాశవాద రాజకీయ నాయకులకు గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు.

# నఖిలీ విత్తనాలు స్వాధీనం



**నారాయణపేట, మే 24 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా ఉట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నిడుగుర్తి గ్రామంలో పోలీసుల దాడులలో నఖిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భీమప్పకు చెందిన ఇంట్లో అక్రమంగా 13.7 కిలోల నఖిలీ పత్తి విత్తనాలు నిల్వ ఉంచి రైతులకు అమ్ముతున్నాడు అన్న సమాచారంతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నఖిలీ పత్తి విత్తనాలను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి ఏవో గణేష్ రెడ్డి పంచనామా అనంతరం నిడుగుర్తి బీమప్పపై కేసు నమోదు చేయడం జరిగిందని ఉట్కూర్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

## సీఏంఆర్ఎఫ్ ను అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే



**రామంతపూర్, మే 24 (నిఘా న్యూస్):** రామంతపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ రామ కాలనీలో నివాసముంటున్న రమేశ్ అనే వ్యక్తి హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ చికిత్స నిమిత్తం 45 వేల రూపాయల ఎల్ ఓ సి ని ఇవ్వడం జరిగింది. వారు పేద కుటుంబం కావడంతో తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావును కోరగా వారు వెంటనే స్పందించి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి నుండి ఎల్ ఓ సి మంజూరు చేయించడం జరిగింది. శుక్రవారం ఎల్ఓసి పత్రాన్ని చికిత్స పొందుతున్న రమేష్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ఓ పేదలకు వరమని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న నిరుపేదలకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. బి ఎల్ ఆర్ ట్రస్టు ద్వారా అనేక ఆసుపత్రిలో చికిత్సలు చేయించడం జరిగిందన్నారు.

## రైతులను మోసం చేస్తే జైలు ఖాయం



**కారేపల్లి, మే 24 (నిఘా న్యూస్):** కారేపల్లి మండల వ్యాప్తంగా విత్తన విక్రయ దుకాణదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారి షాపుకు సంబంధించిన లైసెన్సును రద్దు చేయడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కారేపల్లి మండల ఎస్సై రాజా రామ్ హెచ్చరించారు. దుకాణాలలో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నఖిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేయొద్దని అన్నారు.

## అడ్డగోలుగా చెట్ల నరకివేత



**కారేపల్లి, మే 24 (నిఘా న్యూస్):** కారేపల్లి మండల పరిధిలోని కారేపల్లి చీమలపాడు గ్రామాల మధ్య గల అడవి లో ఇష్టానుసారంగా చెట్టు నరికి వేస్తున్నా సంబంధిత అధికారులు ఎంత మాత్రం పట్టించుకోవడంలేదని, పలువురు విమర్శిస్తున్నారు. సంబంధిత ఫారెస్టు అధికారులు లబ్ది దారుల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఫారెస్ట్ అధికారుల అండదండలతో విచ్చలవిడిగా కలప రవాణా జరుగుతుందని పలువురు ఆరోపించారు.

## నఖిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**నారాయణపేట, మే 24 (నిఘా న్యూస్):** జిల్లాలో నఖిలీ విత్తనాల క్రయ, విక్రయాలు నాసిరకం పురుగుల మందులు అమ్ముతూ రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని జిల్లా ఎస్పి యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగాలం కష్టపడి వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తూ ఉండే రైతులకు ఎవరైనా నఖిలీ విత్తనాలను, నాసిరకం ఎరువులను అమ్మి మోసం చేస్తే అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా పరిధిలో నఖిలీ విత్తనాలను అమ్మే వారిపై పూర్తిస్థాయి నిఘా ఉంచి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసులు వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా సీడ్స్ షాప్స్, మిల్లులు, పర్టీలైజర్ షాప్స్ లలో తనిఖీలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

## కౌంటింగ్ తర్వాత శాంతియుతంగా మెలగాలి



చోడవరం, మే 24 (నిఘా న్యూస్): ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనేందుకు సామరస్యంగా మెలిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చోడవరం నియోజకవర్గం పరిధిలో గల రావికమతం తిరుమల ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రాజకీయ పక్షాలు ప్రజల సమావేశంలోఆయనపాల్గొనిఎన్నికల అనంతరం వ్యవహరించాల్సిన విధానాల గురించి వివరించారు. ఎవరు అల్లర్లకు పాల్పడదని తెలిపారు.

## తీన్మార్ గెలుపు కోసం పట్టపద్రుల సమావేశం



**వలిగొండ, మే 24 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలో పాలకూర్ల వెంకటేశం సమక్షంలో గాయత్రి స్కూల్లో పట్టభద్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా భువనగిరి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోరాడే తత్వమున్న తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ తరపున టికెట్ ఇచ్చి అతని గెలుపుకై మాకు బాధ్యత ఇచ్చి మీరు మేము అందరం కలిసి అత్యధిక మెజార్టీతో తీన్మార్ మల్లన్న గెలిపించాలని కోరారు. సమావేశంలో కొంతం బిక్షపతి, ఎంపీపీ నూతి రమేష్, పాశం సత్తిరెడ్డి, పాండు, మిల్కీ లక్ష్మణ్, దయాకర్ చైతన్య అనిత క్రాంతి దయాకర్ తదితరులు అందరూ పాల్గొన్నారు.

# గిరిప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితం కండి

### నల్లమల వర్ధంతి సభలో బాగం



**ఖమ్మం, మే 24 (నిఘా న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, రాజ్యసభ మాజీ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ తెలుగు ప్రజల మదిలో నిలిచిపోయిన మహా రాజకీయ వేత్త అని, నిత్య స్మరణీయుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. గిరిప్రసాద్ 27వ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయంలో కార్పొరేటర్ బిజి క్లైమెంట్ అధ్యక్షతన వర్ధంతి సభ జరిగింది.సభకు ముందు గిరిప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహానికి సిపిఐ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆవిష్కరించారు. వర్ధంతి సభలో హేమంతరావు మాట్లాడుతూ ఉన్నత విద్యను వదిలి నాటి తెలంగాణ పరిస్థితులను చూసి నైజాం పాలన అంతం కోసం పని చేస్తున్న ఆంధ్ర మహాసభలో గిరిప్రసాద్ చేరారు.ఆ తర్వాత గ్రామ రక్షణ దళాల సభ్యునిగా పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో సాయుధ దళాలలో పని చేశారన్నారు. గిరి ప్రసాద్ దళాన్ని చూసి అప్పటి సైనికులు భయపడే వారని దీనిని దృష్టిలో ఉంచుకుని గిరిప్రసాద్ ను అంతం చేయడం కోసం తుటాల వర్షం కురిపించారని తుపాకీ గుండ్లకు సైతం ఎదురొడ్డి పోరాడిన మహా యోధుడు గిరిప్రసాద్ అన్నారు. జిల్లా కార్యదర్శిగా శాసన సభ్యునిగా రాష్ట్ర కార్యదర్శిగా రాజ్యసభ సభ్యులుగా, పార్టీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ సమర యోధుల స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ గా, బహు బాధ్యతలను గిరిప్రసాద్ నిర్వహించారన్నారు. 1980 దశకంలో రాష్ట్ర కార్యదర్శిగా గిరిప్రసాద్ వ్యవహరించిన తీరు జాతీయ స్థాయి నేతల ప్రశంసలు అందుకుందన్నారు. రాజకీయాలు భ్రష్టు పట్టి ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని ప్రస్తుత పరిస్థితుల్లో గిరిప్రసాద్ ఆదర్శాలు నిత్యం మననం చేసుకోవాలన్నారు.నేటి యువతరం గిరిప్రసాద్ పోరాట స్ఫూర్తిని తీసుకుని ప్రజా ఉద్యమ నిర్మాణం చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు -శింగు నర్సింహారావు. పోటు కళావతి, తాటి వెంకటేశ్వర రావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, బోదా వీరన్న, చానా, మోహన్రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీ నుండే పర్యావరణ పాఠాలు బోధించాలి

### ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి



**బాగ్ లింగంపల్లి, మే 24 (నిఘా న్యూస్):** రాబోయే విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి విద్యార్థులకు పర్యావరణ పాఠాలకు శ్రీకారం చుట్టాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్సీహెచ్ రంగయ్య, జాతీయ సలహాదారుడు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డిలు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. నేటి విద్యావ్యవస్థ మనిషికి వ్యాపార దృక్పదాన్ని అలవర్చి, యాంత్రిక జీవన విధానంతో ముందుకు సాగుతూ సామాజిక- పర్యావరణ భావజాల రహితం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగానే నేడు ప్రకృతి పరిరక్షణ అటకెక్కి సమాజంలో అనేక వాతావరణ సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. మానవ అనారోగ్యం, కలుషిత వాతావరణం, భూమి వేడెక్కడం. ఇవన్నీ పర్యావరణం పట్ల మానవ నిర్లక్ష్యానికి నిదర్శనాలేనన్నారు. ఈ సమస్య నుంచి మానవసమాజం బైట పడాలంటే చిన్నతనం నుంచే విద్యార్థులకు పర్యావరణాన్ని సబ్జెక్ట్ గా అందించి వారిలో పర్యావరణ భావజాలాన్ని పెంచాలని వారు డిమాండ్ చేశారు. భావితరాలను రక్షించుకోవాలంటే ఇంతకు మించిన మార్గం మరొకటి లేదని గుర్తుచేశారు. అంతేగాక ప్రకృతిపై ప్రత్యేకంగా క్విజ్ పోటీలు పెట్టి ఆయా విద్యార్థులకు అదనపు మార్కులు కేటాయించి పర్యావరణంపై మరింత శ్రద్ధ పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అతికొద్ది రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి యుద్ధప్రాతిపధికన చర్యలు తీసుకోవాలని కోరారు.

### నామినేటెడ్ పోస్టుల్లో..

# సీనియర్లకు ప్రాధాన్యత కల్పించాలి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం



**అంబర్ పేట్, మే 24 (నిఘా న్యూస్):** పార్టీ పదవుల్లో నామినేటెడ్ పోస్టుల్లో తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ జిబి శ్యామ్ రావు పార్టీ అధిష్టాన వర్గానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చాలామంది సీనియర్ నేతలు క్రియాశీలంగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. గత 10 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ సీనియర్లు పార్టీని అంటిపెట్టుకొని ఉన్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్లు కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తమ వంతు కృషి చేస్తారని తెలిపారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లోను సీనియర్లు పార్టీ అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా పనిచేశారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, జెండా మోస్తూ వస్తున్న సీనియర్లకు రానున్న రోజుల్లో పార్టీ పదవుల్లో, కీలకమైన నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలని ఆయన డిప్యూటీ సీఎంకు శ్యామ్ రావు విజ్ఞప్తి చేశారు.

# భగవద్గీతపై మద్దయ్య స్వామి ప్రవచనాలు



### ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



**కర్నూలు, మే 24 (నిఘా న్యూస్):** వెలుగోడు లోని అయపురెడ్డి నగర్ లో వెలసిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం మహాభారతం భగవద్గీతలపై మద్దయ్య స్వామి చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను అలరించాయి. ముగింపు సందర్భంగా శుక్రవారం గోపూజ కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు బళ్ళాని వేంకట సత్యనారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, భజన మండలి అధ్యక్షులు తెలుగు నాగలక్ష్మమ్మ, జ్యోత్స్న, సాలమ్మ, అంజనమ్మ, వెంకటేశ్వర్లు,రాజు, శివుడు, ఆంజనేయులు, భరత్ , బి.రాము, నాగేశ్వరరావు, లక్ష్మీ నారాయణ, రమణయ్య, మురళీ కృష్ణ, నాగార్జున, సంజీవరాయుడు, యం.సుబ్రమణ్యం వేదపండితులు, తదితరులు పాల్గొన్నారు. నేడు ప్రథమ వార్షికోత్సవం శ్రీ లక్ష్మి ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా ఉదయం సుదర్శన మహా మృత్యుంజయ హెూమం, మహాబలి పూర్ణాహుతి, 108 కేజీల పులిహోరతో స్వామి వారికి తిరుప్పావడ సేవ, సాయంత్రం ఐదు గంటలకు శ్రీనివాస కళ్యాణం, తదనంతరం భక్తులందరికీ మహాప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు బళ్ళారి వేంకట సత్యనారాయణ తెలిపారు.




శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో భక్తులకు పులిహోర ప్రసాదం వితరణ చేసినట్లు విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షులు కంబాల శ్రీనివాస రావు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా ప్రతి శుక్రవారం స్థానిక దేవి చౌక్ లో వెలిసిన శ్రీ కనక దుర్గ అమ్మ వారి ఆలయంలో 50 కేజీల పులిహోర ప్రసాదన్ని భక్తులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప,తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర,వరసాల ప్రసాద్,వల్లూరి జగన్నాధరావు శర్మ,దేవిచౌక్ సేవకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

*-గోకవరం, మే 24 (నిఘా న్యూస్):*

## కేజీహెచ్ కు బ్యాటరీ వాహనాలు



**విశాఖపట్నం, మే 24 (నిఘా న్యూస్):** విశాఖపట్నం రోగుల రవాణా కోసం నిరంతరం పనిచేసే ఐదు బ్యాటరీ కార్లను కేజీహెచ్ కు స్టీల్ ప్లాంట్ అందజేసింది. కేజీహెచ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ బాగ్చి వీటిని ప్రారంభించారు.40 లక్షలు వెచ్చించి బ్యాటరీతో నడిచే వాహనాలను కొనుగోలు చేసి కేజీహెచ్ కు అందించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగుల రవాణాకు ఉపయోగపడేలా బ్యాటరీ వాహనాలు అందించిన స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## భవాని నగర్ నూతన కార్యవర్గం ఎన్నిక



**నాచారం, మే 24 (నిఘా న్యూస్):** భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను కార్పొరేటర్ శాంతి నివాసంలో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు అయిన కార్యవర్గ సభ్యులు భవాని నగర్ లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై వినతి పత్రాన్ని కార్పొరేటర్ కు అందజేయడం జరిగింది. భవాని నగర్ లో ఉన్న డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించి మిగిలిన అన్ని రోడ్లు వేయిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, సభ్యులు సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఆనంద్ కుమార్ భవాని, అశోక్ రాయుడు, శ్రీధర్ రెడ్డి, సురేందర్ ,ప్రతాప్ రెడ్డి, కే.శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి, బారాస గ్రేటర్ నాయకులు సాయి జన శేఖర్ పాల్గొన్నారు.

## వైభవంగా పెద్దమ్మ తల్లి ఉత్సవాలు



**తూప్రాన్, మే 24 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని ఘనపూర్ దమ్మక్కపల్లి శివారులో గల పెద్దమ్మ గుడి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్వస్తివాచనం, అఖండ దీపారాధన, గణపతి హెూమం అమ్మవారి కళ్యాణోత్సవం కార్యక్రమాన్ని వేద బ్రాహ్మణులు దత్తుశర్మ వినయ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పణ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగాయి. అనంతరం కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నప్రసాదంని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, పుర ప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి మాత జయంతి ఉత్సవాలు



**బాలాపూర్, మే 24 (నిఘా న్యూస్):** వాసవిమాత కన్యకాపరమేశ్వరీ జయంతి ఉత్సవ వేడుకలు ఆర్కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ప్రొద్దటూరు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ఆర్కేపురంలోని వైష్ణవి కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, అమరావధి లక్ష్మీనారాయణ, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్త లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కుల దైవం వాసవి మాత జయంతిని జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఈ పూజ కార్యక్రమంలో సుమారు 5 వందల మంది మహిళలతో అభిషేకం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి జ్యువెలర్స్ అధినేత ఇమ్మడి రమేష్, ఆర్కే పురం ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీలు నాగేంద్రయ్య , శ్రవణ్ కుమార్, కోశాధికారి అరవేటి వేణు మాధవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యామ్, రాముని సద్గుణ, లక్ష్మీ సుబ్రమణ్యం, శ్రీలత, నాచం లక్ష్మీ, వాణి శ్రీ, గంధం పద్మ హాజరయ్యారు.

## ప్రభుత్వ హామీలు నెరవేర్చేదాక పోరాటం

### స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి భైరవ బొట్ల



**సూర్యాపేట, మే 24 (నిఘా న్యూస్):** ప్రభుత్వ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ నిరుద్యోగుల పక్షాన పోరాడుతానని ఖమ్మం, వరంగల్,నల్గొండ పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి మధిర ప్రముఖ న్యాయవాది భైరవబోట్ల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోర్టు తదితరచోట్ల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉప ఎన్నికల్లో తనకి ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే తన ఎమ్మెల్సీ వేతనం విద్యార్థి, నిరుద్యోగ సంక్షేమానికి ఉపయోగిస్తామన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ గల్లా ఎగరేసేలా తన నడవడిక ఉంటుందన్నారు. ఈనెల 27న జరిగే పట్టబద్దుర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన సీరియల్ నెంబర్ 44 అని పట్టబద్దర్లు మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## చదువుతోనే జీవితంలో వెలుగులు

### రైతుబంధు మాజీ అధ్యక్షుడు గోపాలరావు



**ముస్తాబాద్, మే 24 (నిఘా న్యూస్):** రాజాన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మోహినికుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండడం వలన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్ రావు ప్రైవేట్ టీచర్లతో విద్యను అందించడం జరిగింది. తద్వారా విద్యార్థులు గురుకుల పాఠశాలలో అత్యధిక సీట్లు సాధించారు. మల్లేష్ భాగ్య కుమారుడు హేమంత్ కు గంగాధర్ గురుకుల పాఠశాలలో చదివి పదో తరగతి ఫలితాల్లో 10/10 మార్కులు సాధించాడు. హేమంత్ ను అభినందించి గోపాల్ రావుతో పాటు పలువురు నాయకులు శాలువా కప్పి అభినందించారు. చదువుతోనే మన జీవితంలో వెలుగు వస్తుందని బాగా చదివి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఉన్నత శిఖరాల జరగాలని గోపాలరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రావు గోవవర్ధన్ రావు, మురళి, దేవయ్య, దేవకిషన్,భుమరాజు, శ్రీనివాస్,శీలం నర్సింలు,శీలం జితేందర్,సుమన్, వెంకటేష్, ఆంజనేయులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రేణుక మాత గడ పవనం ఊరేగింపు



**గంభీరావుపేట, మే 24 (నిఘా న్యూస్):** గంభీరావుపేట మండల కేంద్రంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక సిద్ధి యోగం కార్యక్రమంలో భాగంగా 26వ రోజు శ్రీ రేణుక మాత గడ పవనం ఊరేగింపు యాత్ర శుక్రవారము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధిల గుండా ఊరేగింపును నిర్వహించారు. మహిళలు గ్రామస్తులు గడపవనాన్ని స్వాగతం పలుకుతూ తమ భక్తి భావాన్ని చాటారు. ఆదివారం శ్రీ రేణుక జమదగ్ని కళ్యాణం నిర్వహించనున్నట్లు గౌడ సంఘం నేతలు తెలిపారు.

# బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

### ఎమ్మెల్సీ ఇంచార్జ్ కళ్యాణ్ నాయక్



**నాగార్జునసాగర్, మే 24 (నిఘా న్యూస్):** వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాల నుంచి బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, పట్టభద్రులఎమ్మెల్సీ ఇంచార్జ్ కళ్యాణ్ నాయక్ పిలుపునిచ్చారు. నాగార్జున సాగర్ నందికొండ మున్సిపాలిటీలో శుక్రవారం ఆయన బిజెపి శ్రేణులతో కలిసి టౌన్ అధ్యక్షులు గణేష్ తంగరాజు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఇది మోదీ సుపరిపాలనకు నిదర్శనమని ప్రధాని మోదీ దేశ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా పెంచారని ఆయన అన్నారు. అదేవిధంగా మోదీ పాలనపై ప్రజలు ఎంతో విశ్వాసం చూపుతున్నారన్నారు. అందుకే ఎక్కడకు వెళ్లినా బీజేపీకి అనూహ్య ఆదరణ వస్తోందన్నారు. తెలంగాణలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి 12 స్థానాలను కైవసం చేసుకోబోతుందని దానితో బీజేపీలో చేరేందుకు అన్ని వర్గాల వారు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఈ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ కు ఓటు వేస్తే అది మోరిలో వేసినట్లేనని అలా ఓటు వృధా కాకుండాఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కమలం గుర్తుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చలమల వెంకటరెడ్డి టౌన్ అధ్యక్షులు గణేష్ రంగరాజు జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము రామదాసు ఓబీసీ జిల్లా మోర్చా ఉపాధ్యక్షులు కంచర్ల రామారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రబోయిన రాజు, బిజెపి మహిళా అధ్యక్షురాలు వామనగిరి జయమ్మ,మండల ఎస్సీ మోక్ష ఉపాధ్యక్షురాలు కిన్నెర రమణమ్మ భూత్ అధ్యక్షులు శుభ తంగరాజు పాల్గొన్నారు.


# మలబార్ షోరూంలో.. వెండి ఆభరణాల ప్రదర్శన



హబ్సిగూడ, మే 24 (నిఘా న్యూస్): హబ్సిగూడ మలబార్ గోల్డ్ డైమండ్స్ షోరూంలో వెండి ఆభరణాల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో భాగంగా వెండి అభరణాలు వెండి వస్తువులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ముఖ్య అతిధులచే మలబార్ గోల్డ్ డైమండ్స్ మేనేజ్మెంట్ టీం మెంబెర్స్ శ్రేయోభిలాషుల సమక్షంలో ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో భాగంగా ప్రతీ ఐదు వేల వెండి ఆభరణాల కొనుగోలుపై రూ.500 ప్రత్యేక తగ్గింపు. వెండి వస్తువులపై ప్రత్యేకమైన ఆఫర్లను పొందగలరు, ఈ ప్రదర్శన కేవలం మలబార్ గోల్డ్, డైమండ్స్ హబ్సిగూడ షోరూంలో 24 మే నుండి 02 జూన్, 2024 వరుకు నిర్వహించబడుతుంది. మలబార్ గోల్డ్ డైమండ్స్ నిబద్ధతలో భాగంగా, తమ వినియోగదారులకు 10 న్యాయమైన వాగ్దానాలను అందిస్తుంది. ఖచ్చితమైన తయారీ ధర, రాళ్ల బరువు, నికర బరువు మరియు ఆభరణాల రాళ్ల విలువతో కూడిన పారదర్శక ధరల పట్టి, ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ, పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించే టప్పుడు బంగారానికి 100 శాతం విలువ, బంగారం మార్పిడిపై శూన్య తగ్గింపు నూరు శాతం బిఐఎస్ హాల్ మార్కుతో ధృవీకరించబడిన స్వచ్ఛమైన హెచ్యుఐడి బంగారం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 28-పాయింట్ల నాణ్యత పరీక్షలు నిర్వహించిన ఐజిఐ జిఐఎ ధృవీకరించిన వజ్రాభరణాలు, బైబ్యాక్ గ్యారెంటీ, నాణ్యతను తనిఖీ చేయడానికి క్యారెట్ ఎనలైజర్, జీవితకాల నిర్వహణ బాధ్యతాయుతమైన మూలాల నుండి బంగారం సేకరణ వంటి వాగ్దానాలను అందిస్తుంది. మలబార్ గోల్డ్, డైమండ్స్ అతి వేగంగా పెరుగుతున్న నమ్మకమైన జ్యూవెలరీ బ్రాండ్ మలబార్ గ్రూప్ కి సంభందించిన మూల్యమైన సంస్థ, ఈ సంస్థ తమ వార్షిక ఆదాయంలో నుంచి గణనీయమైన వాటాని సామజిక సంస్థాగత భాధ్యత రూపంలో ఆరోగ్యం, ఉచిత విద్య, నిరుపేదలకు గృహ నిర్మాణం, మహిళా సాధికారత ఇంకా పర్యావరణ రక్షణ విభాగాలలో తమవంతు సాయం అందిస్తుంది. మలబార్ గోల్డ్, డైమండ్స్ ఆభరణాల విక్రయ వ్యాపారంలో ఒక ప్రత్యేకత ఏర్పరుచుకుంటూ ఇండియా, సింగపూర్, జీ.సి.సి మొదలగు దేశాలలో 350 షోరూంలతో విస్తరించుకొని ముందుకు సాగుతుంది అని సంస్థ స్టోర్ హెడ్ మొహమ్మద్ అహమ్మెద్ సోఫీ వివరించారు.

# రాకేష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

### 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్, మే 24 (నిఘా న్యూస్):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. బి ఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పోరేటర్ మరుపల్ల రవి హాజరై ఆయన మాట్లాడుతూ ఓటు కలిగిన పట్టభద్రుని ఇళ్ళకు వెళ్లి విద్యావేత్త నిస్వార్థపరులు సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి మచ్చలేని ఏనుగుల రాకేష్ రెడ్డికి ఓటు వేయాలని ఆయన కోరారు. నేటి కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు ప్రకటించడం వలన ప్రజలు నమ్మి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చినారని వారు ప్రకటించిన హామీలలో ప్రజలకు ఉపయోగపడు ఏ ఒక్క హామీ అమలు గానందున నేటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిరస్కరిస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పూజారి విజయ్ కార్యదర్శి వనం కుమార్ నాయకులు కోరే కృష్ణ అంకం దేవానంద్ మరుపల్ల గౌతమ్ కళ్యాణపు వెంకటేశ్వర్లు గజ్జి సాంబయ్య శెట్టి మోహన్ చీర రమేష్ సాదుల రంజిత్ పసునూరి రమేష్ గోనె మధు ఎండి ఫరీద్ బౌరిశెట్టి లలిత క్యాతం రాజేందర్ భౌరిశెట్టి సదానందం నామాల రాజు తదితరులు పాల్గొన్నారు.



కొనిజర్ల మండలంలోని పల్లిపాడు గ్రామానికి చెందిన ఉబ్బనపల్లి సాంబశివరావు సుధారాణి దంపతుల కూతుర్ల భార్గవి రిషితాల ఓణీల అలంకరణ వేడుక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉప్పల చెలక మాజీ సర్పంచ్ బాదావత్ సైదులు నాయక్ హాజరై చిన్నారులకు అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, విద్యాభ్యాసంలో మంచిగా రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

*-వైరా, మే 24 (నిఘా న్యూస్):*

## తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రచారం



**వలిగొండ, మే 24 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు నల్లగొండ వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్స్ లో భాగంగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న రెండో నెంబర్ పై మీ మొదటి ప్రాధాన్యత ఓటును వేయవలసిందిగా వేములకొండ గ్రామంలోని పట్టబద్రుల ఇంటింటికి పోయి ఓటు వేయమని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎరుపుల వెంకటేశం స్థానిక ఎంపీటీసీ సామ రాంరెడ్డి మండల కో ఆప్షన్ మెంబర్ ఎస్కే రసూల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేష్ రెడ్డి పులిపలుపుల రాములు మాజీ ఉపసర్పంచ్ కట్ట సత్తయ్య గాజుల యాదగిరి కాంగ్రెస్ గ్రామ శాఖ కార్యదర్శి ఎనుగుల నరసింహ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇంజమూర్ శ్రీను భోద్ర బోయిన నరసింహ కాడిగల రవి తదితరులు పాల్గొన్నారు.

## వేసవికాలం శిక్షణ తరగతులు



**వలిగొండ, మే 24 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ వలిగొండ హై స్కూల్ క్రీడా మైదానంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి కాల శిక్షణ తరగతులకు ప్రతిరోజు లాగే ఈరోజు విద్యార్థిని విద్యార్థులకు హై స్కూల్ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం దాత పబ్బు స్వామి గౌడ్ అలంకార్ ఫుట్ వేర్స్ అరటి పండ్లు గుడ్లు బిస్కెట్లు అందజేయడం జరిగింది ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ వేసవి కాల శిక్షణ తరగతులకు ప్రతిరోజు ఉదయం క్రీడా మైదానంలో ఆటలు నేర్పించే ఇన్చార్జులు ఇన్చార్జులు చెప్పే విధంగా విన గలరు అదేవిధంగా సెల్ ఫోన్లు టీవీలకు దూరంగా ఉండవలెను అన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ వాకర్స్ అసోసియేషన్స్ సభ్యులు బచ్చు శ్రీనివాస్ పోలేపాక బిక్షపతి నాగెలి వలి వంగరి రమేష్ మైసొల్ల శ్రీకాంత్ నీరుడు భాను పల్లెర్ల నరేష్ బాలగోని మధు తవుటం రమేష్ దంతూరి వెంకటేష్ పోలేపాక రాజేష్ నోముల వెంకటేష్ వేసవి కాల శిక్షణ తరగతులకు ఇన్చార్జులు పోలెపాక సాయికుమార్ మచ్చ గిరి వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీగా గుజ్జులను గెలిపించాలి




**వరంగల్, మే 24 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని దేశాయిపేట కెఆర్ గార్డెన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన వరంగల్ తూర్పునియోజకవర్గ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సమావే శం వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు డా. కె.లక్ష్మణ్ హాజరైనారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ఇన్చార్జి మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్ రావు, వరంగల్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పాల్గొన్నారు. తూర్పు నియోజకవర్గ పట్టభద్రులను బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి(1)ప్రాధాన్యతఓటువేసి గెలిపించాలని వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ లోక్ సభ అభ్యర్థి ఆరూరి రమేష్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి పిఎల్ శ్రీనివాస్, జి.కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నంసతీష్ షా, వన్నాల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యేలు టి.రాజేశ్వరరావు, వన్నాల శ్రీరాములు, పార్లమెంట్ కో కన్వీనర్ అల్లం నాగరాజు కార్పొరేటర్లు గందె కల్పన, చాడ స్వాతి జిల్లా పదాధికారులు పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

# నత్త నడకన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం



- **కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అధికారుల అలసత్వం**
- **పాత వంతెన కూల్చి ఆరు నెలలు గడిచినా పనులలో జాప్యం**
- **వర్షాకాలం లోపు బ్రిడ్జి నిర్మాణ మయ్యేనా...!**

**గంభీరావుపేట, మే 24 (నిఘా న్యూస్):** గంభీరావుపేట మండలం మానేరు వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వం మానేరు వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.10.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 30 సంవత్సరాల క్రితం నిర్మించినలో లెవెల్ వంతెన ఆరు నెలల క్రితం కూల్చి దాని నుండి తీసిన లక్షలు విలువ చేసే సలాకాను బహిరంగంగా స్థానిక నాయకులు అధికారులు కుమ్మక్కై అమ్ముకున్నారని విమర్శలు ఉన్నాయి. వర్షాకాలం సమీపిస్తుండడంతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులలో జాప్యం జరుగుతుందని విమర్శలువ్యక్తమవుతున్నాయి. ఆరు నెలలు గడుస్తున్న నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. కనీసం పిల్లర్లు కూడా వేయలేదు. బ్రిడ్జి నిర్మాణ టెండర్ దక్కించుకున్న రావి కంపెనీ కాంట్రాక్టర్ పనులు చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. దీంతో బ్రిడ్జి నిర్మాణ పనులు పిల్లర్లదశలోనే ఉంది. బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నందున రాకపోకలు సాఫీగా జరిగేందుకు పక్కనే తాత్కాలిక రోడ్డు నిర్మించారు. నెల రోజుల క్రితంకురిసినచిన్నపాటి వర్షానికి వరదతో కొద్దిగా కొట్టుకుపోవడం వల్ల మట్టి పోసి మళ్ళీ పూడ్చారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో ఎగువ మానేరు ఉప్పొంగితే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. రాక పోకలకు అంతరాయం ఏర్పడుతుంది. కామారెడ్డి -సిద్ధిపేట,దుబ్బాక కు ప్రధాన రోడ్డు మార్గం కావడంతో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. సమీపంలో కామారెడ్డి రైల్వే స్టేషన్ ఉన్నందున నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళుతూ ఉంటాయి. వర్షాలు పడి ఎగువ మానేరు ఉప్పొంగితే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

### అధికారుల అలసత్వం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం...



**మానేరు వాగుపై నిర్మిస్తున్న హై లెవల్ వంతెన నిర్మాణ పనులలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే పనులలో జాప్యం జరుగుతుంది. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన పనులు జరగడం లేదు. పాత లోలెవల్ వంతెన కూల్చి 6నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. అధికారులు స్పందించి నిర్మాణ పనుల వేగం పెంచి తొందరగా బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలి.**

*- వెంకట్ యాదవ్, గంభీరావుపేట బిఆర్ఎస్ అధ్యక్షుడు*

### నిమ్మకు నీరెత్తినట్టు అధికారులు...



**గంభీరావుపేట లింగన్నపేట మధ్య మార్గంలో మానేరు వాగుపై నిర్మిస్తున్న హై లెవెల్ వంతెన నిర్మాణ పనులలో అధికారులు కాంట్రాక్టర్ లు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. నాణ్యమైన పాత లోలెవల్ వంతెనను తొలగించడం విడ్డురం. ఎక్కడ కూడా పాత వంతెనలను తొలగించలేదు. హై లెవెల్ వంతెన నిర్మాణ పనులలో జాప్యం తగదు. బ్రిడ్జి నిర్మాణం తొందరగా చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం.**

*- దోసల చంద్రం, ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షులు*

### తొందరలోనే పూర్తి చేస్తాం



**ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పనులలో జాప్యం జరిగిన సంగతి వాస్తవమే. తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశాం. బ్రిడ్జి నిర్మాణ పనులు వేగం పెంచాలని సదర్ కాంట్రాక్టర్ ను ఆదేశించాం. బ్రిజనిర్మాణ పనులు వేగవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.**

*- నరేందర్, ఆర్ అండ్ బి ఏఈ గంభీరావుపేట*

## బిజెపి బలపరిచిన అభ్యర్థిని గెలిపించండి



**వలిగొండ, మే 24 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వలిగొండ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు పాశం భాస్కర్ మండల పార్టీ అధ్యక్షులు బోల్ల సుదర్శన్ ఆధ్వర్యంలో కార్యాలయంలోని ఉద్యోగులను కలిసి బిజెపి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇట్టి కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కందుల తానేష మండల ఉపాధ్యక్షుడు గంగాదారి దయాకర్ మండల కార్యదర్శి మందుల నాగరాజు బర్ల మల్లేశం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

### వివిధ పార్టీల నాయకులతో సమావేశమైన పోలీసులు



**ఎటపాక, మే 24 (నిఘా న్యూస్):** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా, చింతూరు ఇన్చార్జ్ ఏఎస్పీ, రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వర రెడ్డి, ఎటపాక సీఐ రామారావు ఆదేశాలతో ఎటపాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రాజకీయ పార్టీల నాయకులతో ఎస్ఐ కే పార్థసారథి శుక్రవార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ కక్షలతో కానీ అల్లర్లు ప్రేరేపించే విధంగా కానీ అవాంఛనీయ సంఘటనలకు, హింసాత్మక చర్యలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఎటపాక పరిధిలో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోలేదని, అందుకు సహకరించిన ప్రతి ఒక్క నాయకునికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక ముందు కూడా ఎటువంటి గొడవలు అల్లర్లు జరగకుండా చూడాలని పార్టీ నాయకులకు సూచించారు.

## గన్ చేపల వేటపై తొలి హక్కు గంగపుత్రులదే

### గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా



**వరంగల్, మే 24 (నిఘా న్యూస్):** వరంగల్ జిల్లా ఫిషర్ మెన్ కాంగ్రెస్ మత్య విభాగం చైర్మన్ గా నియమితులైన వర్ధన్నపేటకు చెందిన గుడిబోయిన సారంగపాణి గంగపుత్రను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి మర్యద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ చేపల చెరువులలో చేపల వేటపై తోలి హక్కు సాంప్రదాయ మత్యకార బెస్త గంగపుత్రలదే అని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వము తరుపున మత్యకారుల కోరకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలలో తొలుత సాంప్రదాయ మత్యకార బెస్త, గంగపుత్రులకు ప్రాధాన్యత కల్పించే విధముగా కృషి చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు.

## తిరుపతిలో స్ట్రాంగ్ రూముల తనిఖీ

### జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



**తిరుపతి, మే 24 (నిఘా న్యూస్):** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నందు ఏర్పాటుచేసిన తిరుపతి జిల్లాకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ నందు ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ లను, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లను శుక్రవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద ప్రస్తుతం అమలులో ఉన్న భద్రతాపరమైన ఏర్పాట్లను సమీక్షించి, తగిన సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన,కులశేఖర్ శాంతిభద్రతలు, శ్రీనివాసరావు సాయుధ దళం,డీఎస్పీలు. తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించడం నేర్పించిన తీన్మార్ మల్లన్న

- చట్టసభకు పంపించడం మనందరి బాధ్యత
- అధికారం పోయినా కేటీఆర్ కు అహం పోలేదు
- కేటీఆర్ పై నిప్పులు చెరిగిన మంత్రి సీతక్క



**ములుగు, మే 24 (నిఘా న్యూస్):** జిల్లా కేంద్రం ములుగు మండలం లోని ఇంచర్ల గ్రామంలో శుక్రవారం ఎంఆర్ గార్డెన్ లో జరిగిన ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సన్నాహక సమావేశం కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు పైడా కుల అశోక్ అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న హాజరైనారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ సోనియా గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గా తీన్మార్ మల్లన్నను గుర్తించినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతూ,ప్రశ్నించే గొంతుక పట్ట భద్రులకు ఆత్మ బంధువు తీన్మార్ మల్లన్న అని కొనియాడారు. గత 10 యేండ్ల దొరల పాలన సాగించిన కెసిఆర్ పై మల్లన్న తన ఛానల్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలను మేలుకొల్పి ప్రజల పక్షాన నిలిచి కొట్లాడిన మల్లన్నను మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వం కక్ష గట్టి జైలుకు పంపిందని అటువంటి బిఆర్ఎస్ పార్టీని బొంద పెట్టే సమయం ఆసన్నమైందని అందు కొరకు తెలంగాణ ప్రజల పక్షాన నిలిచిన మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్ట భద్రులు ఆశీర్వదించాలని సీతక్క కోరారు. అంతే కాకుండా రాష్ట్రంలో కేటీఆర్ కు అధికారం పోయిన అహం తగ్గలేదని ప్రజా పాలన అందిస్తున్న ప్రభుత్వంపై కారు కూతలు కూస్తున్నాడని, అందు వల్ల పట్ట బద్రులు ఈ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి తగిన రీతిలో బుద్ధి చెప్పి మల్లన్నను గెలిపించాలని మంత్రి సీతక్క అన్నారు. అనంతరం అభ్యర్థి మల్లన్న మాట్లాడుతూ పల్లా రాజేశ్వర్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే నని, గతంలో కూడా ఎమ్మెల్సీగా దొంగ ఓట్లతో గెలిచాడని ఆరోపించారు. పట్టభద్రులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని, మీ ఓటు వృథా కాకుండా ఎల్లవేళలా మీకు అండగా ఉండి సాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, నియోజక వర్గ ఇంచార్జీ కూచన రవళి రెడ్డి,డాక్టర్ పులి అనీల్‌తో పాటు రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు, తీన్మార్ మల్లన్న టీం తదితరులు పాల్గొన్నారు.

# నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పరచాలి



నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

**జగిత్యాల, మే 24 (నిఘా న్యూస్):** నేర విచారణ మరింత సమర్థవంతంగా చేయడంతో పాటు చాలా రోజుల నుండి పెండింగ్ లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు జిల్లా పోలీస్ అధికారులంతా కృషి చేయాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటివరకు నమోదైన కేసులలో నాన్ గ్రేవ్ కేసులు,గ్రేవ్ కేసుల విషయంలో తీసుకోవలసిన చర్యలు గురించి అధికారులకు వివరించారు. గుర్తు తెలియని మృతదేహాలు దొరికినప్పుడు కేసు నమోదు చేయగానే వెంటనే ఫోటోలు సీసీటీఎన్ఎస్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. దీని ద్వారా ఎక్కడైనా మిస్సింగ్ పర్సన్ ఉంటే రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి మిస్సింగ్ కేసులను ఛేదించవచ్చని సూచించారు. దోపిడీ, దొంగతనాలు ఇతర రకాల నేరాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో పాటు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. లోక్ అదాలత్ దృష్ట్యా పోలీస్ అధికారులు రాజీ పడ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పరిధిలో నఖిలీ విత్తనాలు, ఎరువులు విక్రయాలకు పాల్పడే విక్రయదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని ఎస్.పి తెలిపారు. సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాప్ యజమానులు నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలని,నాణ్యమైన విత్తనాలు,ఎరువులు రైతులకు అందించాలని సూచించారు. మార్కెట్లో బిటి 3 పత్తి విత్తనాలకు ఎలాంటి పర్మిషన్ లేదని, అనుమతి లేని విత్తన విక్రయాదారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. విత్తన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయలని, తప్పనిసరిగా బిల్ అడిగి తీసుకోవాలని తెలిపారు. నఖిలీ విత్తనాల నివారణ కోసం స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేయడం జరిగిందని, టీం జిల్లాలో వ్యవసాయ అధికారులను సహాయంతో అన్ని ఎరువుల దుకాణంలో తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రవీంధ్ర కుమార్, రఘు చందర్,ఉమా మహేశ్వర రావు రంగా రెడ్డి, వ్యవసాయ అధికారులు, డి.సి.ఆర్.బి,సి.సి.ఎస్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, లలక్ష్మీనారాయణ, రఫీక్ ఖాన్, సిఐ లు,ఎస్ఐ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ

- క్లౌడ్ కిచెన్ ప్రారంబోత్సవంలో
- కౌన్సిలర్లు శివారెడ్డి విజయ్ బాబు
- గోపాల గణేష్ కుమార్









**రాజేంద్రనగర్, మే 24 (నిఘా న్యూస్):** స్వయం ఉపాధితో జీవనోపాధి మెరుగుపడుతుందని కావున మహిళలు స్వయం ఉపాధి పై అడుగులు వేయాలని కోకాపేట్ కౌన్సిలర్లు గోపాల విజయ్ బాబు శివారెడ్డి అన్నారు. కోకాపేట స్థానిక పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు శాంతినగర్లో విజేత క్లౌడ్ కిచెన్ ను శుక్రవారం ఏర్పాటు చేసుకోగా కోకాపేట్ కౌన్సిలర్లు గోపాల విజయబాబు శివారెడ్డి గండిపేట కౌన్సిలర్ గోపాల గణేష్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. మహిళలు ఉపాధి పొందే ఇలాంటి కార్యక్రమాలు గండిపేటలో కూడా ఏర్పాటు చేస్తామని అక్కడి మహిళలకు హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ కన్సర్న్ ఇంటర్నేషనల్ (పీసీఐ) ఇండియా యూనిట్ వారు సహాయ సహకారాలు అందించడమే కాకుండా క్లౌడ్ కిచెన్ లో ఉపయోగించే అన్ని రకాల వంట సామాగ్రిని అలాగే మహిళలు ధైర్యంగా బయటకువెళ్లి ఎక్కడైనా తమ ఆహారాన్ని అమ్మే విధంగా బండిని విరాళంగా ఇచ్చారు. స్వయం ఉపాధిని ఎంచుకోవడం వైపు సంతోషంగా ఉందని గోపాల విజయ్ బాబు అన్నారు. తన వంతుగా 50 వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. శివారెడ్డి మాట్లాడుతూ క్లౌడ్ కిచెన్ వారు అవుట్ లెట్ ఓపెన్ చేయడానికి సరైన స్థలం ఇప్పిస్తానని క్లౌడ్ కిచెన్ నడిపిస్తున్న మహిళలకు మాట ఇచ్చారు. వంటకు సంబంధించి శిక్షణ కోసం సహకారం అందించిన సయోధ్య డైరెక్టర్ మృదుల పీసీఐ సిటీ లీడ్ హెబినైజర్ ఆపరేషన్ టీం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పెద్ద అంబర్ పేటలో..

# అక్రమ నిర్మాణాలు ఫుల్ చర్యలు నిల్





**అబ్దుల్లాపూర్ మెట్, మే 24 (నిఘా న్యూస్):** పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు ఫుల్ చర్యలు మాత్రం నిల్ అనే చెప్పాలి. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలోని 4 , 5, 9, 23వ వార్డుల్లో అనుమతులు లేని కమర్షియల్ షెటర్లు , షెడ్ లు, సెల్లార్ ల నిర్మాణాలు చేపడుతూ మున్సిపాలిటీకి రావలసిన కోట్ల రూపాయల ఆదాయానికి అక్రమ నిర్మాణదారులు గండి కొడుతున్నారు. నగర శివారు జాతీయ రహదారిని ఆనుకొని ఔటర్ రింగ్ రోడ్డు సమీపాన ఉండడంతో ఈ వార్డుల్లో కమర్షియల్ షెడ్లు , షట్టర్లు , సెల్లార్ ల నిర్మాణాలు జోరుగా కొనసాగుతుండగా కొందరు అనుమతులు ఒకలా తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారు. వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు లక్షల్లో ముడుపులు తీసుకుంటూ, మామూలకు అలవాటు పడి అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లడం లేదననే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు , అధికారుల అండదండలతోనే ఈ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని నిర్మాణాన్ని బట్టి రేటు మాట్లాడుకుని లక్షలు వెనకేసుకుంటూ మున్సిపాలిటీకి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు ఇచ్చామని చెప్తున్న అధికారులు కాలయాపన చేస్తుండడంతో ఇదే అదునుగా భావించి అక్రమ నిర్మాణాలను చేపడుతున్న నిర్మాణదారులు తొందరగా నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాలను గుర్తించి మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు

### మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్



**మణికొండ, మే 24 (నిఘా న్యూస్):** మణికొండ మున్సిపల్ పరిధి పంచవటి కాలనీలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్థులను కమిషనర్ ఆదేశానుసారం టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. మున్సిపల్ పరిధి పంచవటి కాలని రోడ్డు నంబర్. 16,17లో స్టిల్ట్ ప్లస్ 5 ఫ్లోర్స్ పర్మిషన్ వుండగా స్టిల్ట్ ప్లస్ 6 ఫ్లోర్స్, పెంట్ హౌస్ నిర్మించిన సదరు వ్యక్తి. అలాగే స్టిల్ట్ ప్లస్ 5 ఫ్లోర్స్ పర్మిషన్ ఉండగా స్టిల్ట్ ప్లస్ 6 ఫ్లోర్స్ నిర్మించడంతో అదనంగా నిర్మించిన అంతస్థులను మున్సిపల్ కమిషనర్ అదేనుసారం పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేయడం జరిగిందని టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ వెల్లడించారు. మున్సిపల్ పోలీసు అదికారులు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## శ్రీవారి సేవలో సంజయ్ జాజు దంపతులు

### భారత సమాచార ప్రసార శాఖ కార్యదర్శి



**తిరుమల, మే 24 (నిఘా న్యూస్):** భారత సమాచార ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు దంపతులు తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం ప్రాతఃకాల సమయంలో అభిషేక సేవలో దర్శించుకున్నారు. అంతకు మునుపు సదరు భారత కార్యదర్శి తమ శాఖకు చెందిన ఆల్ ఇండియా రేడియో, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, దూరదర్శన్ ఉన్నత స్థాయి అధికారులతో తిరుపతి నందు సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వీరి వెంట లైజన్ అధికారి బాల కొండయ్య సంబంధిత అధికారులు ఉన్నారు.

## డ్రైవర్స్ కాలనీలో కార్డన్ సెర్చ్

### రికార్డులు లేని 9ద్విచక్ర వాహనాలు స్వాదినం





**తిరుపతి, మే 24 (నిఘా న్యూస్):** చిత్తూరుజిల్లా పోలీసు అధికారులు ఇచ్చిన ఆదేశాలతో ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక డ్రైవర్స్ కాలనీలో గంగవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ చిన్న గోవిందు, పెద్దపంజాని బైరెడ్డిపల్లి ఎస్.ఐలు అలాగే పలమనేరు ఎస్.ఐ.సహదేవి, 30మంది పోలీస్ సిబ్బందితో డ్రైవర్స్ కాలనీలో కార్డన్ ఆండ్ సెర్చ్ ఆపరేషన్ శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఇందులో అనుమానితుల ఇళ్ల ను,తనిఖీ చేయడం జరిగింది. ద్విచక్రవాహనాల రికార్డులు పరిశీలించి,రికార్డులు లేని 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని సి.ఐ.చిన్నగోవిందు తెలిపారు.

## డా.జనార్ధన్ కు సిపిఐ అభినందనలు



**తిరుపతి, మే 24 (నిఘా న్యూస్):** శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్న విశాలాంధ్ర మాజీ బ్యూరో, ఏపీయూడబ్ల్యూజే జిల్లా మాజీ అధ్యక్షులు టీ జనార్ధన్ ను అభినందిస్తూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కే రామకృష్ణ సత్కరించారు. శుక్రవారం తిరుపతి సిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం అనంతరం జనార్ధన్ ను దుశ్యాలవతో సన్మానించారు . జర్నలిజం అనంతరం పార్టీలో వివిధ బాధ్యతలలో పనిచేస్తూ నేడు పి హెచ్ డి పూర్తి చేసి డాక్టరేట్ అందుకోవడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు,జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, విశ్వనాథ్, నదియా, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, నగర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ బలరాం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలు ఉంటే చెప్పండి చిటికెలో పరిష్కరిస్తాం



**ఉప్పల్, మే 24 (నిఘా న్యూస్):** ఒక్కొక్కొరిది ఒక్కో కష్టం. సమస్య చిన్నదైనా పెద్దదైనా వారికి అండగా ఉండే ప్రయత్నం చేస్తున్నా. రేవంతన్న అండతో ప్రజల కష్టలు తీర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, రామంతపూర్, హబ్సిగూడ, నాచారం, చిలుకానగర్, మల్లాపూర్, నాచారం, కుషాయిగూడ ప్రాంతానికి చెందిన పలువురు బస్తీల నాయకులు, కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు తమ సమస్యలను పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి ఆయనకు వినతి పత్రాలను అందజేసి తమ గోడును చెప్పుకున్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బస్తీల ప్రజలు కాలనీలో అసోసియేషన్ ప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి వెంటనే తీసుకెళుతున్నట్లు తెలిపారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి విచ్చేస్తామని హామీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండదండలతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అవసరమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఏమైనా నియోజకవర్గ సమస్యలు ఉంటే పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకురావాలని సీఎం పేర్కొన్న విషయాన్ని పరమేశ్వర్ రెడ్డి మరోసారి గుర్తు చేశారు.

## గ్లోబల్ సిటీస్ జాబితాలో హైదరాబాద్

### భారత్ లో హైదరాబాద్ కు తొమ్మిదవ స్థానం



**హైదరాబాద్, మే 24 (నిఘా న్యూస్):** ప్రపంచంలోని అగ్ర నగరాల జాబితాను 'ఆక్స్ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్' విడుదల చేసింది. ప్రపంచ స్థాయిలో హైదరాబాద్ 564వ స్థానంలో నిలిచింది. ఢిల్లీ ఇందులో 350ర్యాంక్ సాధించింది. ఈ జాబితాలో న్యూయార్క్ అగ్రస్థానంలో ఉంది. భారత దేశంలో టాప్ నగరాల జాబితాను పరిశీలిస్తే ఢిల్లీ తొలి స్థానం సంపాదించింది. తరువాత స్థానాల్లో బెంగళూరు, ముంబై, చెన్నై, కొచ్చి నిలిచాయి. హైదరాబాద్ 9వ స్థానం దక్కించుకుంది.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మేడిపల్లి, మే 24 (నిఘా న్యూస్):** విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించుట కోసం శనివారం ఉదయం 11గంటల నుండి 12:30 గంటల వరకు పిర్జాదిగూడ మున్సిపల్ పరిధిలోని 33/11 కె వి సబ్ స్టేషన్ పరిధిలోని శంకర్ నగర్, పార్వతి నగర్, శ్రీరామ ఆర్టీసీ కాలనీ, గణేష్ నగర్, శ్రీపాద ఎన్క్లేవ్, విష్ణుపురి ఎన్క్లేవ్, న్యూ సాయి నగర్, పర్వతాపూర్ 33/11 కె వి పరిధిలోని మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనివాస హిల్స్, లక్ష్మీ నగర్, ఇండిపెండెంట్ కాలనీ, మహారాజ ఫోర్ట్స్, గాంధీనగర్, లక్ష్మి నరసింహ టెంపుల్ పరిసరాలు, రాంనగర్, భవాని నగర్, మల్లికార్జున నగర్ ఫేస్ 1 అండ్ 2, రాఘవేంద్ర నగర్, పర్వతాపూర్ ఓల్డ్ విలేజ్, గోకుల్ నగర్, బాలాజీ నగర్ మొదలగు కాలనీలలో విద్యుత్ కి అంతరాయం ఉంటుందని ఎ ఈ సత్యనారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## రెవెన్యూ పనుల్లో దళారులను నమ్మొద్దు



**పెద్దపల్లి, మే 24 (నిఘా న్యూస్):** కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జహీర్ పాషా మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో భూమి పట్టాలు గాని. చట్ట వ్యతిరేకమైన ప్రభుత్వ అనుమతులు లేని సహజ వనరులు. ఇసుక మాఫియా. మట్టి మాఫియా,వంటి దందాలు చేయడం సరియైనది కాదని. ప్రభుత్వ అనుమతి పొందిన ఇసుక తరలింపు వ్యవస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో జాహిద్ పాషా అన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలింపు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియమ నిబంధనలు పాటించాలని రెవెన్యూ కార్యాలయంలో మోసగాళ్లను దళారులను నమ్మి డబ్బులు తీసుకొని పట్టాలు చేయిస్తామనే వ్యక్తులను కూడదని భూమి పట్టాల విషయంలో నమ్మి డబ్బులు పెట్టి మోసపోవద్దని నేరుగా వ్యక్తులే ఆధారాలతో కూడిన భూ సంబంధిత సర్వే నెంబర్లతో సహా డాక్యుమెంట్లను సమర్పించాలని వాటిని వెరిఫికేషన్ చేసి పట్టాలు పొంద వలసిందిగా పేర్కొన్నారు.

## దుర్గ మాత ఆలయంలో కుస్తీ పోటీలు



**సంగారెడ్డి, మే 24 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం వన దుర్గ మాత ఆలయంలో అమ్మవారికి బోనాలు బండ్ల ఊరేగింపుతో మూడు రోజుల పండుగ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిష్ట నియమాలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పాలాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. మల్లయోధులు వివిధ రాష్ట్రాల నుండి కుస్తీ పోటీలకు హాజరవుతారని, విజేతలకు విలువైన బహుమతులు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లింగారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత రాధాకృష్ణ బిఆర్ఎస్ ఎంపీటీసీ సాయిరెడ్డి జలశంకర్ నారాయణరెడ్డి సాయి రెడ్డి మధిర కృష్ణ రవి పండుగు కిష్టయ్య జలా దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# బండ్లగూడ జాగీర్ మేయర్ గా లత గౌడ్





- ప్రమాణస్వీకారం చేయించిన ఆర్డీవో వెంకట్ రెడ్డి
- మద్దతు తెలిపిన 17 మంది కార్పొరేటర్లు
- మేయర్ కు బాధ్యతలను అప్పగించిన కమిషనర్ శరత్ చంద్ర



**రాజేంద్రనగర్, మే 24 (నిఘా న్యూస్):** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా మద్దెల లతా గౌడ్ ను శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో 17 మంది కార్పొరేటర్ల సమక్షంలో ప్రమాణస్వీకారం చేయించిన రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి.అనంతరం మేయర్ ఛాంబర్ లో వేద పండితులు క్రైస్తవ మైనారిటీ మత పెద్దలు మేయర్ కు ఆశీర్వచనాలు అందించారు.మద్దేల లత ప్రేమ్ గౌడ్ మేయర్ ఎన్నికలకు డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి సహా16 మంది కార్పొరేటర్ల సమక్షంలో కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర బాధ్యతలను అప్పగించారు.ఈ మేరకు నూతనంగా ఎన్నికైన మేయర్ మద్దేల లత గౌడ్ కు పూల బోక్కేను అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన చేవెళ్ళ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి రాష్ట్ర పాడిపరిశ్రమల అభివృద్ధి శాఖ చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్.మేయర్ తోపాటు కుటుంబ సభ్యులను గజమాల పూల దండలతో ముంచెత్తి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బాణసంచా పేల్చి సంబరాల్లు చేసుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఒక లెక్క ఇప్పటి నుంచి మరో లెక్క అంటూ కార్పొరేషన్ లో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేకుండా కార్పొరేటర్లను కలుపుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి నిస్వార్థంగా సేవలందిస్తానని స్పష్టం చేశారు.కార్పొరేషన్ ప్రజలతో మమేకమై వారి అవసరాలను తీరుస్తూ మేయర్ బాధ్యతను నిర్వర్తిస్తానని అన్నారు. ప్రభుత్వ భములు అన్యాక్రాంతం అవ్వకుండా తగిన చర్యలు చేపడతానని అన్నారు.

# సీడి కీర్తన రాష్ట్రస్థాయి ర్యాంకర్

**శ్రీకాకుళం, మే 24 (నిఘా న్యూస్):** సెమ్స్ ఒలంపియాడ్ సంస్థ హైదరాబాద్ వారు ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి ప్రతిభా పరీక్షలో పాల్గొన్న జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల దండుగోపాలపురమునకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు సీడి.కీర్తన ఇప్పిలి.దీపిక ఉత్తమప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయిలో 30, 34వ ర్యాంకులు జోనల్ స్థాయిలో 12,16వ ర్యాంకులు సాధించారు. వీరికి సంస్థవారు నగదు బహుమతి, మెమెంటో ప్రశంసా పత్రాలను అందచేయనున్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోత.చైతన్య ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం అదికేశవరెడ్డి తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, మార్కండేయులు, కిష్టవేణీ, రోజ అభినందిస్తూ, వీరు మరిన్ని ప్రతిభా పరీక్షలలో పాల్గొని ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని అబినందనలు తెలిపారు. మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచి పాఠశాలకు, తల్లితండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బైరి మనీష్ కుమార్ స్టేట్ ర్యాంక్ 24వ,జోనల్ ర్యాంక్ 7వ సాధించారు. వజ్రపు కొత్తూరు హుకుంపేటకు చెందిన 33వ స్టేట్ ర్యాంక్,15వ జోనల్ ర్యాంక్ సాధించాడు. ఎచ్చేర్ల మండలం ముద్దాడకు చెందిన వండాన శరత్ కుమార్ 34 స్టేట్ ర్యాంక్,16వ జోనల్ ర్యాంక్ సాధించాడు. బోరుభద్రకు చెందిన సుధా 34వ స్టేట్ ర్యాంక్, 16వ జోనల్ ర్యాంక్ సాధించి గ్రామానికి,పాఠశాలకు మంచి పేరు తెచ్చారు.



ఇప్పిలి దీపిక రాష్ట్రస్థాయి ర్యాంకర్



సిక్కోలు చిన్నారుల ఉత్తమ ప్రతిభ

# మైనారిటీ కాలేజీని కాలనీలో ఏర్పాటు చేయడం సరికాదు




**మేడిపల్లి, మే 24 (నిఘా న్యూస్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ న్యూ సాయి నగర్, సాయి నగర్ కాలనీలో జనావాసాల మధ్యలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నటువంటి మైనారిటీ కాలేజ్ ని ఏర్పాటు సరికాదని న్యూ సాయి నగర్, సాయి నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బండి కన్వెన్షన్ హాల్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో బిజెవైఎం జిల్లా అధ్యక్షులు పవన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాలనీలో ఉన్న నాలుగు కాలేజీలతో ట్రాఫిక్ సమస్య, పార్కింగ్ సమస్య వల్ల కాలనీవాసులు, పాదాచారులు, వాహనదారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. కాలనీవాసులకు ఇప్పుడు కొత్తగా మరొక కాలేజ్ ని కనీస వసతులు లేని బిల్డింగ్ లో ఏర్పాటు చేయడం సరికాదని కాలనీవాసులు వ్యతిరేకిస్తున్నారు. హయత్ నగర్ లో ఉన్నటువంటి కాలేజ్ ని అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురై పలుమార్లు హెచ్చరికలు పోరాటం చేయగా ప్రభుత్వం అక్కడి నుంచి పీర్జాదిగూడకు తరలించడం సరికాదని తెలిపారు. ఈ విషయం పై జిల్లా కలెక్టర్ కు, స్థానిక మున్సిపల్ కమిషనర్ కు కాలనీవాసులు ఫిర్యాదు ఇవ్వగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో జనావాసుల మధ్యలో ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఏర్పాటు చేసినటువంటి ఈ మైనార్టీ కాలేజ్ ని నిలిపివేసి...ప్రభుత్వ స్థలాలలో వైశాల్యమైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. లేనిచో పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జైపాల్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు నరసింహారెడ్డి, సత్తయ్య, కాలనీ వాసులు దేవేందర్, లోడే చంద్రయ గౌడ్, రమేష్ చారి, నరేష్, ఉపేందర్, జితేందర్ రెడ్డి, సొమయ్య, శ్రీనివాస్, సింహాచలం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నకిలీల జాగ్రత్తలు అవసరం

### తల్లాడ ఏవో ఎండి తాజుద్దీన్





**తల్లాడ, మే 24 (నిఘా న్యూస్):** నకిలీ విత్తనాలు విక్రయించేందుకు కొందరు వ్యాపారులు గ్రామాల్లోకి సైతం వస్తున్నారని అటువంటి వారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తల్లాడ మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండి తాజుద్దీన్ రైతులకు సూచించారు. తల్లాడ మండల గ్రామాలలో శుక్రవారం రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు నఖిలీ విత్తనాలతో మాటలు చెప్పి విక్రయించేందుకు వస్తున్నారని నఖిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా ఇంటింటికి వెళ్లి విత్తనాలు విక్రయిస్తే వారి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. గుడ్డ సంచుల్లో గాని, నఖిలీ లేబుల్ తో ప్యాకెట్లను విక్రయిస్తున్నారని అలాంటి వాటి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాలలో తిరిగి విత్తనాల అమ్మే వారి దగ్గర నుంచి కొనుగోలు చేయొద్దని గుర్తింపు పొందిన, ఆదికృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు విధిగా బిల్లులను, రసీదులను తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యేంతవరకు వీటిని భద్రంగా దాచుకోవాలని సూచించారు. గ్రామాలలో ఇంటింటికి తిరిగి విత్తనాలన్నీ వారి సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు అందించాలని అన్నారు. అనంతరం వేసవి దుక్కులు చేసుకోవాలని పచ్చి రొట్ట, జిలుగులు వేసుకొని కలియదున్నితే భూసారం పెరిగి పంట దిగుబడులు అధికంగా వస్తాయని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తల్లాడ మండల ఏఈఓ లు గురుమూర్తి, శివకుమార్, త్రివేణి, నాగులు మేరా, హసీనా బేగం, నాగేశ్వరరావు, సాయి కుమార్, నరేష్, గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గద్దల ప్రశాంతకు మాజీ మంత్రి జవహర్ నివాళులు



**మధిర, మే 24 (నిఘా న్యూస్):** పట్టణంలో ఎస్సీ కాలనీకి చెందిన గద్దల ప్రశాంత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.శుక్రవారం దశదినకర్మ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్,తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు,బిజెపి జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ మధిర పట్టణ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు, హాజరయ్యింది గద్దల ప్రశాంత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జవహర్ మాట్లాడుతూ ప్రశాంత మృతి బాధాకరమన్నారు.ఆమె లేని లోటు కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపిందన్నారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గద్దల ప్రశాంత కుమారుడు నాని,కోడలు మాధురి(వార్డు కౌన్సిలర్), గద్దల ప్రకాశరావు,మైనీడు జగన్మోహనరావు, రామిశెట్టి నాగేశ్వరావు,బిజెపి పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, గట్టి గుండె జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారి కృప అందరిపై ఉండాలి

### ఎల్ఎం ట్రస్ట్ చైర్మన్ కొప్పుల స్నేహలత



**ధర్మపురి, మే 24 (నిఘా న్యూస్):** ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతర సందర్భంగా ఆలయంలో మాజీ మంత్రి,పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సతీమణి,ఎల్ ఎం కొప్పుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొప్పుల స్నేహలత ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ శ్రీవారి కృప ఉండాలని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గుర్రం మోహన్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాచూరి శ్రీధర్,మాజీ డైరెక్టర్ నాడెం శ్రీనివాస్,మాజీ ఎంపిటిసి మూల మంగ మల్లేశం,బోట్ల వనపర్తి మాజీ సర్పంచ్ ప్రమీల శ్రీనివాస్, నాయకులు పాకాల రాజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నరసింహ స్వామికి మొక్కులు చెల్లించిన విప్



**ధర్మపురి, మే 24 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం జాతరకు ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్,పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవస్థానం ఈవో కాంతారెడ్డి,ఆలయ అర్చకులు లక్ష్మణ్ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం విప్ అడ్లూరి మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి కరుణ కటాక్షాలు ధర్మపురి నియోజకవర్గ ప్రజలందరిపై ఎళ్లవేళలా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుండి అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసిన ఈవో ను ప్రశంసించారు. నరసింహ స్వామి జాతరకు పెద్ద ఎత్తున వివిధ గ్రామాల నుండి భక్తులు రావడంతో స్థానిక ఎస్సై టి.సత్యనారాయణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించి, తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి,ఏఎంసి మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు,మాజీ విఎస్-ఎస్ చైర్మన్ దేవి జనార్ధన్, కాడే సూర్యనారాయణ,పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈసెట్ ర్యాంకర్లకు సన్మానం



**ధర్మపురి, మే 24 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన పులకొల్ల సాయి దీపిక, బొప్పనపల్లి అభిలాష్ ఈ సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించగా, వారిని కొత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు కొలుముల గంగన్న,మాజీ సర్పంచ్ తాళ్ళ మల్లేశం గౌడ్, పులకొల్ల లింగమూర్తి ఇద్దరు విద్యార్థులను అభినందించారు.భవిష్యత్తులోఇలాగే రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు ఎన్ఆర్ఐ కొలుమల దామోదర్ యాదవ్ సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజ్మీర విజయ, గ్రామ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## వానాకాలం సాగుకు
# అందుబాటులో విత్తనాలు

- రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన విత్తన మేళా
- ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ బి.గోపి




**రాజేంద్రనగర్, మే 24(నిఘా న్యూస్):** ఈ వానాకాలం సాగుకి రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ బి.గోపి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ముమ్మరంగా సాగుతోందని ఆయన వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన విత్తనమేళ 2024 ని ఆయన ప్రారంభించి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రైతుల డిమాండ్ కి అనుగుణంగా అన్ని జిల్లాల్లో ఆయా రకాల విత్తనాలని అందుబాటులో ఉంచడానికి రెండు నెలల నుంచి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని గోపి వివరించారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రభుత్వం చాలా తీవ్రమైన చర్యలు తీసుకుంటుందన్నారు.

విత్తనాలు కొనుగోలు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతుల్లో చైతన్యం తీసుకురావడానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీలు, సాగు విధానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు 'రైతు నేస్తం' అనే కార్యక్రమంతో రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు,శాస్త్రవేత్తల మధ్య చర్చ కార్యక్రమాలని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నఖిలీ విత్తనాలు వల్ల రైతులు నష్టపోయినప్పుడు తక్షణ నష్టపరిహారం అందించేందుకు వీలుగా విత్తన చట్టంలో సవరణలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు.

ఈ అంశాలపై అసెంబ్లీలో చర్చ జరిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గోపి వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల్లో విత్తనాలను అందుబాటులో ఉంచామని రైతులు ఆందోళన చెందవద్దని పిజెటిఎస్ఎయు రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామి రెడ్డి వివరించారు.సరైన విత్తనాలు,మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులకు మంచి దిగుబడులు, ఆదాయం వస్తుందని ఆయన అన్నారు.

రాష్ట్రంలో సాగయ్యే ప్రధాన పంటలకి సంబంధించి నాణ్యమైన,మేలైన, తెగుళ్ళను తట్టుకో గలిగే అనేక రకాల విత్తనాలని విశ్వవిద్యాలయం అందుబాటులోకి తెచ్చిందని వాటిని వినియోగించుకోవాలని రఘురాం రెడ్డి రైతులకి సూచించారు.

ఈ సందర్భంగా రైతులకి విత్తనాలను పంపిణీ చేశారు. వివిధ పంటలకు సంబంధించిన పిజెటిఎస్ఎయు రూపొందించిన అనేక కరపత్రాలని సమావేశంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి, పిజెటిఎస్ఎయు విత్తన పరిశోధన సాంకేతిక సంస్థ సంచాలకులు డాక్టర్ పి.జగన్మోహన్ రావు, విత్తన ధ్రువీకరణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేశవులు, విశ్వవిద్యాలయ అధికారులు శాస్త్రవేత్తలు,రైతులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌ను.. కేంద్ర పాలిత ప్రాంతం చేయాలని కుట్రలు

### పట్టభద్రుల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు



**సత్తుపల్లి, మే 24(నిఘా న్యూస్):** ఎన్నికల ముందు అలవి కాని హామీలతో ప్రజలను మోసగించి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని, అటువంటి పార్టీని శాసన మండలిలో నిలదీయాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి దీవించా లని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పట్టభద్రుల ఓటర్లకు పిలుపు నిచ్చారు. శుక్రవారం సత్తుపల్లిలో రాకేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏది ఏమైనా గెలుపు రాకేష్ రెడ్డి దేనని అన్నారు. ఈ సీటును మొదటి నుంచి బీఆర్ఎస్ పార్టీని గెలుస్తూ వచ్చిందని గుర్తు చేశారు. మేధావులు విజ్ఞానవంతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాకేష్ రెడ్డిని గెలిపించడం ద్వారా మొద్దు నిద్ర పోతున్న కాంగ్రెస్ కళ్లు తెరిపించాలన్నారు. నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, రెండు లక్షల ఉద్యోగాలు ఎటు పోయాయని అన్నారు. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వని కాంగ్రెస్‌ను ఎన్నికల్లో తరిమి కొట్టాలన్నారు. రాకేష్ రెడ్డిని గెలిపిస్తే శాసన మండలిలో కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి పని చేయిస్తారని చెప్పారు. హైదరాబాదును కేంద్రపాలిత ప్రాంతంగా చేయడంతో పాటు మరో పదేళ్లు ఉమ్మడి రాజధా నిగా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, తస్మా జాగ్రత్త అని అన్నారు. హైద రాబాద్ తెలంగాణ ప్రజల హక్కు అని అన్నారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ పుట్టిన గడ్డకు సేవ చేసుకునేందుకు అమెరికాలో ఉన్నతమైన ఉద్యోగం వదులుకొని వచ్చిన రాకేష్ రెడ్డిని గెలిపించుకోవాలని అన్నారు. నీతి నిజాయితీ ఉన్న రైతు బిడ్డ అయిన ఆయనకు ఆశీస్సులు ఇవ్వాలన్నారు.రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల కష్టాలు తెలిసిన ఆయన గెలిస్తే శాసనమండలిలో క్రియాశీలక పాత్ర పోషిస్తారని అన్నారు. అభ్యర్థి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ మీ సేవ కోసం నిరుద్యోగుల భవితవ్యం కోసం వచ్చిన తనను ఆశీర్వదించాలని కోరారు. తనను గెలిపిస్తే పైసా జీతం తీసుకోకుండా వచ్చిన సొమ్ముతో సహాయ నిధిని ఏర్పాటు చేసి, నిరుద్యో గులను ఆదుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి,ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధు, పురుషోత్తంరెడ్డి, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పట్ల రైల్వే శాఖ చిన్నచూపు

### వారికి కేటాయించిన బోగీలో ఇతరుల ప్రయాణం
### పట్టించుకోని రైల్వే అధికారులు ఆర్పీఎఫ్ పోలీసులు





**హైదరాబాద్, మే 24(నిఘా న్యూస్):** దివ్యాంగుల పట్ల రైల్వే శాఖ చిన్నచూపు చూస్తుందనే ఆరోపణలు సర్వత్ర వెల్లువెత్తుతున్నాయి. రైళ్లలో దివ్యాంగులకు ప్రత్యేకంగా కేటాయించిన బోగీని సామాన్య ప్రయాణికులు ఆక్రమించుకుంటుండడంతో, వారు కూర్చొని ప్రయాణించేందుకు సీట్లు కరువవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో దివ్యాంగులు ప్రయాణంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతి రైల్లోనూ దివ్యాంగుల కోసం రైల్వే శాఖ చివరగా ఉన్న బోగిని కేటాయిస్తుంది. ఈ భోగిలో దివ్యాంగుడితోపాటు అతని సహాయకుడికి ప్రయాణించేందుకు అనుమతి ఉంటుంది. ఈ భోగిలో 6మంది కూర్చునేందుకు వీలుగా రెండు సీట్లు, ఇద్దరు పడుకున్నందుకు వీలుగా రెండు బెర్తులు మాత్రమే ఉంటాయి. ఎక్కువ సంఖ్యలో దివ్యాంగులు వస్తే ఈ భోగి వారు కూర్చునందుకే సరిపోదు. అయితే దివ్యాంగుల కోసం కేటాయించిన బోగీలో సామాన్య ప్రయాణికులు ఎక్కి ప్రయాణిస్తున్నారు. దీంతో దివ్యాంగులు కూర్చునేందుకు సీట్లు కరువవుతున్నాయి. ఈ క్రమంలో దూర ప్రాంతాలకు వెళ్లే దివ్యాంగులు నానా అవస్థలు ప్రయాణించాల్సి వస్తుంది. ఈ క్రమంలో దివ్యాంగులు సామాన్య ప్రయాణికుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ కోసం రైల్వే శాఖ ప్రత్యేకంగా కేటాయించిన భోగిలో ఇతరులు ఎక్కితే వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఆర్పీఎఫ్ పోలీసులు పట్టించుకోవడంలేదని దివ్యాంగులు ఆరోపిస్తున్నారు. తమకోసం కేటాయించిన భోగిలోని బాత్రూంలను కూడా ఎప్పటికప్పుడు రైల్వే సిబ్బంది శుభ్రం చేయడం లేదని,దీంతో ముక్కుపుటలు అదిరే కంపులోనే ప్రయాణించాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## తూప్రాన్ మండలంలో పూర్తయిన ధాన్యం సేకరణ

### సంపూర్ణంగా వరి ధాన్యాన్ని సేకరించిన వెంకటాయపల్లి ఐకెపి సెంటర్
### ఐకెపి సభ్యులను సన్మానించిన ఆర్డిఓ జయచంద్ర రెడ్డి



**తూప్రాన్, మే 24 (నిఘా న్యూస్):** తూప్రాన్ మండలం మెదక్ జిల్లాలోనే మొదటగా ఐకెపి వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ద్వారా రైతులు పండించిన వరి ధాన్యాన్ని పూర్తిగా సేకరించి నందున తూకంను నిలిపివేయడం జరిగింది. తూప్రాన్ డివిజన్ వెంకటయ పల్లి గ్రామంకు సంబంధించిన వరి పూర్తిగా తూకం చేసి రైస్ మిల్ కు తరలించారు. ఐకెపి కొనుగోలు సెంటర్ ఇంచార్జ్ సభ్యులు కె. రేఖ వివోఏఎస్ లత ఇరువురు ట్యాబ్ లో పూర్తి వివరాలను పొందుపరిచారు. ఇందుకుగాను జె. శ్రీలతను తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి సన్మానించారు. తూప్రాన్ తాసిల్దార్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా లోనే మొదటగా 13 రోజుల క్రితం మొత్తం ధాన్యం 3072 క్వింటాల వడ్లు కొనుగోలు చేయడం జరిగింది. టాబ్ ఎంట్రీ చేసి. 98 రైతులకు గాను 98 మంది రైతులకు డబ్బులు వేయించి సెంటర్ ను మూసివేయడం చేసినందుకు ఆర్డిఓ చేతుల మీదుగా సన్మానం చేయించినట్లు తాసిల్దార్ విజయ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రుక్మిణి, రైతులు, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రమణీయంగా వేణుగోపాల స్వామి రథోత్సవం

### గోవింద నామస్మరణతో మార్మోగిన కొత్తపల్లి



**గంభీరావుపేట, మే 24 (నిఘా న్యూస్):** గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలోని పురవీధులు పునీత మయ్యాయి. సాక్షాత్తు మహావిష్ణు అవతారమైన శ్రీ వేణుగోపాల స్వామి ఇరువురు భామలతో కలిసి లోక కళ్యాణార్థం శుక్రవారం ఊరేగింపులో భక్తులకు కనువిందు చేశారు. గోవింద శ్రీ నామస్మరణతో శ్రీమన్నారాయణ జయహో అంటూ భక్తులు నిరాజనం పలికారు. వేణుగోపాల స్వామి రథోత్సవ ఊరేగింపులో కోలాటాలు డప్పు వాయిద్యాలు కళాకారుల నృత్యాలు ప్రముఖుల దర్శనాలతో కొత్తపల్లి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు అలరించాయి. రథంపై కొలువుదిన దేవత మూర్తులను భక్తులు క్యూలైన్లో ఒక్కొక్కరు ముడుపులు మొక్కుబడులు చెల్లించుకుని స్వామివారిని దర్శించుకున్నారు. గోవిందా నామస్మరణంతో కొత్తపల్లి పురవీధులు మారుమోగాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయకమిటీ చైర్మన్ నాగపూరి శ్రీనివాస్ గౌడ్ కమిటీ సభ్యులు గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు నిర్వహించారు.

## యాదగిరి గుట్టలో...
# భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- వృద్ధులకు వికలాంగులకు కష్టంగా మారిన స్వామి దర్శనం
- వీల్ చైర్స్ ర్యాంప్ లేక అవస్థలు పడుతున్న వికలాంగులు
- భానుడి నుండి రక్షణ లేదని మండి పడుతున్న భక్తులు



**యాదగిరిగుట్ట, మే 24 (నిఘా న్యూస్):** భువనగిరి జిల్లాలోని యాదాద్రి యాదగిరి గుట్టపై భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడంలో ఆలయ అధికారులు పూర్తిగా విఫలం చెందారని యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామీ దర్శనానికి వచ్చే భక్తులు అంటున్నారు. వికలాంగులకు వృద్ధులకు వీల్ చైర్ తోపాటు ర్యాంపు లేకపోవడంతో స్వామీ వారి దర్శనానికి నోచుకోవడంలేదని వాపోతున్నారు. భానుడి వేడిని తట్టుకుంటూ అలాగే భక్తులు స్వామివారి దర్శనం చేసు కునేందుకు నానా ఇబ్బందులూ పడుతున్నారు. నృసింహ స్వామివారిని దర్శించుకునేందుకు యాదాద్రికి వచ్చే భక్తులకు వృద్ధులకు వికలాంగులకు సరైన సౌకర్యాలను కల్పించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.కొండ పైకి కారు వెళ్ళడానికి ఒక్కో వాహనానికి 500 రూపాయలను వసూలు చేస్తున్నారని భక్తులు అంటున్నారు. నృసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు విజ్ఞప్తి చేశారు.

## బీఆర్ఎస్ కు జేడీ మద్దతు




**వరంగల్, మే 24 (నిఘా న్యూస్):** తెలంగాణలో లోక్సభ ఎన్నికల సందడి ముగిసింది. ప్రస్తుతం నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందడి కనిపిస్తోంది. ఈ సిటింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ తెగ ప్రయత్నిస్తోంది. ఇక్కడ రాకేశ్ రెడ్డిని గెలిపించే భారాన్ని కేటీఆర్ భుజాల కెత్తుకున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న రాకేశ్ రెడ్డికి జై భారత్ నేషనల్ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రకటించారు.

## యాదాద్రిలో ఆన్ లైన్ సేవలు



**భువనగిరి, మే 24 (నిఘా న్యూస్):** భక్తులకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం అధికారులు గుడ్ న్యూస్ చెప్పారు. భక్తుల కోసం ఆన్ లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. యాదాద్రి ఆలయంలో బుకింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు ప్రకటించారు. వెబ్ సైట్ ద్వారా శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనం, పూజ కైంకర్యాల టికెట్లను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. సేవలు మే 23వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చాయి.

## పెవిలియన్ గ్రౌండ్ లో ప్రకృతి వైద్యంపై సదస్సు




**ఖమ్మంటౌన్, మే 24 (నిఘా న్యూస్):** ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్ నడక సాదకులు ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వైద్యులు డాక్టర్ కె.వై. రాంచందర్ రావు ప్రకృతి వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పెవిలియన్ గ్రౌండ్ నడక సాదకులు ప్రకటించారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బుడిగెం శ్రీనివాస్, కొండమీది వెంకట్ కార్యక్రమం ఆర్గనైజర్స్ రాకం శ్యామ్ బాబు, మంద వెంకటేశ్వర్లు, తాల్లూరి వేణు విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైద్యం అవగాహన సదస్సు ఈ ఆదివారం ఉదయం పెవిలియన్ గ్రౌండ్ నందు నిర్వహించ బడుతుందని సదస్సులో డాక్టర్ కె.వై. రామచందర్ రావు అవగాహన కలిగిస్తారని నడక సాదకులు సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ప్రకృతి వైద్యంపై జరిగే సదస్సు విజయవంతం కోసం శుక్రవారం పెవిలియన్ గ్రండ్ నందు జరిగిన కార్యక్రమంలో జానకి రామయ్య, లక్ష్మణ రావు, దామోదర్ రెడ్డి, నారాయణ, వెంకట్ బాబు, కృష్ణారెడ్డి, రాము, కెవి, సత్యనారాయణ,కృష్ణ,జ్యోతి, తార సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

# కళ్ళల్లో కారం చల్లుతున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు

- రహదారులపైనే తాలింపులతో ఘాటైన వాసనలు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- అర్ధ రాత్రుల వరకు తెరిచి ఉంటున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు
- పట్టించుకోని లా అండ్ ఆర్డర్ పోలీసులు






**అంబర్ పేట్, మే 24(నిఘా న్యూస్):** కాచిగూడ, నల్లకుంట, అంబర్ పేట్ పోలీస్ స్టేషన్ ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జనవాసాల మధ్య ఏర్పాటుచేసిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల కారణంగా సామాన్య జనం ఇబ్బంది పడుతున్న సంబంధిత అధికారులు ఆయా సెంటర్ల నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నారు. ప్రధానంగా తిలక్ నగర్ బాయమ్మ గల్లీ టర్నింగ్, కిషన్ రావు హాస్పిటల్ ఎదురుగా, తిలక్ నగర్ హాస్పిటల్ సమీపంలో, చే నంబర్ శంకర్ నగర్, బతుకమ్మ కుంట రోడ్డు, శివం రోడ్, అలీ కేఫ్, బాపునగర్, పటేల్ నగర్, ఫీవర్ హాస్పిటల్ చౌరస్తా, అడిక్మెట్ , చెప్పల్ బజార్, కాచిగూడ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో జనవాసాల మధ్య పెద్ద సంఖ్యలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కొనసాగుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి అర్ధ రాత్రుల వరకు కొనసాగుతున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల వలన తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఈ సెంటర్లలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్న సమయంలో ఘాటైన వాసనలు వెలువడుతున్నాయని, ఆ వాసనలు పీల్చి తాము నానా అవస్థలు పడుతున్నామని, ఇండ్లలో ఉండలేని పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానిక మహిళలు తెలిపారు. అలాగే ఈ సెంటర్లలో ఆహార పదార్థాలను కడాయిలో తయారు చేస్తున్న సమయంలో గరిటతో కలపడం వల్ల పెద్ద శబ్దాలు వెలువడుతున్నాయని, ఈ శబ్దాల కారణంగా రాత్రులు తమకు నిద్రలు ఉండడం లేదని వారు అంటున్నారు. అర్ధరాత్రి 12గంటల సమయంలోనూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నుండి భారీ శబ్దాలు వస్తుండడంతో తమకు కునుకు లేకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శబ్దాలు చేయవద్దని తాము సెంటర్ల నిర్వాహకులను కోరితే తమ పట్ల వారు తమపైనే దౌర్జన్యం చేస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులపై పలుమార్లు తాము స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించు కోవడం లేదని, రాత్రులు పెట్రోలింగ్ పోలీసులు ఇటువైపు వస్తున్న సెంటర్ల వైపు కన్నెత్తి చూడ్డం లేదని వారు ఆరోపిస్తున్నారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో స్థానికంగా ఉన్న కిరాణా షాపులను మూసివేస్తున్న పెట్రోలింగ్ పోలీసులు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల జోలికి వెళ్లకపోవడం అనుమానాలకు తావిస్తుందని వారు అంటున్నారు.

### కల్తీ ఆహార పదార్థాల విక్రయం

ఈ ప్రాంతంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్న జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. కల్తీ నూనెలు, మసాలాలతో, కుళ్ళిన మాంసంతో ఇక్కడ ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు వారు తెలిపారు. కొన్ని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో చనిపోయిన కోళ్ల మాంసంతో ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదులు అందుతున్న జిహెచ్ఎంసి సర్కిల్ 16 ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లలో తనిఖీలు చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ సెంటర్లలో కల్తీ ఆహార పదార్థాల దందా యదేచ్ఛగా కొనసాగుతుందని వారు గుర్తు చేశారు. ఇప్పటికైనాసంబంధిత పోలీసు, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com